1976 - 2010 34
సంవత్సరాలుగా
దేవుని అపార కృపలో

# స్పందన
ఆధ్యాత్మిక మాస పత్రిక

*The largest circulated Telugu monthly since 34 years*


డిసెంబరు 2010 | సంపుటి 34 | సంచిక 12



వ్యవస్థాపక, ప్రధాన సంపాదకులు
ఆచార్య ఆరార్కే మూర్తి
ప్రచురణకర్త, సంపాదకులు
డా॥ దేవసహాయం దండల
సహకారం
పాస్టర్ పి. సురేష్ బాబు
సంపాదక వర్గం
పాస్టర్ జి. దేవరాజు, బ్రదర్ కె. పరమానందం,
బ్రదర్ ఆర్. ఎలూజై, బ్రదర్ ఎన్. దేవానంద్,
శ్రీమతి ఎన్. లిల్లీ భాస్కర్
సహాయ సంపాదకులు
బ్రదర్ డి. ఎఫ్రాయిం, బ్రదర్ డేవిడ్ అబ్రహాం


## చందా వివరాలు

| | స్వదేశంలో | విదేశాలకు |
|---|---|---|
| 1 సంవత్సరం | ₹ 150 | $ 20 |
| జీవిత సభ్యత్వం | ₹ 2000 | $ 200 |
| పోషక సభ్యత్వం | ₹ 150 (ప్రతినెల) | $ 20 |

ప్రత్యేక మనవి - అందరికీ అందుబాటులో ఉండాలని సం. చందా రు.150/- గా ఉంచాము. వాస్తవానికి సుమారుగా రు.200/- ఖర్చవుతుంది. పరిచర్య అభివృద్ధి కోసం ప్రార్థించి, ప్రభువు మిమ్మును ప్రేరేపిస్తే మీ సేవా కానుకలు పంపాలని మనవి. కానుకలు పంపుచున్న చందాదారులకు మా హృదయపూర్వక కృతజ్ఞతలు, ఈ సేవా పరిచర్య నిమిత్తం మీరు పంపే కానుకలు, చెక్కులు, డ్రాఫ్టులు, ఎం.ఓ.లు, స్పందన (SPANDANA) పేరు మీద పంపాలి. మీ కానుక అందిన వెంటనే స్పందన రశీదుతో పాటు ఉత్తరం రాస్తాము.

ఆన్‌లైన్ అకౌంట్ పేరు - "స్పందన"SPANDANA
అకౌంట్ నం. 015810100016691
ఆంధ్రాబాంక్, గుణదల బ్రాంచి , విజయవాడ.


మా అడ్రస్
స్పందన ఆధ్యాత్మిక మాసపత్రిక
51-4-12, ఇ.ఎస్.ఐ హాస్పటల్ రోడ్, గుణదల,
విజయవాడ - 520 004, ఫోన్ : 2456547,
E-mail: spandana1976@gmail.com


## ఈ సంచికలో..


| | |
|---|---|
| క్రిస్మస్ | 6 |
| కాపరులకే ఎందుకు? | 8 |
| ఆదర్శప్రాయులు | 10 |
| యూదా బేత్లెహేమీయుడు | 12 |
| యూదులరాజు ఎక్కడ? | 14 |
| అతిది తెచ్చిన బహుమతి | 18 |
| క్లుప్త ప్రసంగాలు | 23 |
| బైబిల్ పేర్లు | 25 |
| ఆయన నక్షత్రము | 26 |
| ప్రకటన గ్రంథం | 28 |





మా ప్రియ పాఠకులకు, పోషకులకు,
రచయితలకు, ప్రకటన కర్తలకు
క్రిస్మస్, నూతన సంవత్సర శుభాకాంక్షలు
*- సంపాదక వర్గం*


Founder & Chief Editor : Acharya R.R.K.Murthy

Printed, Published and owned by
DEVASAHAYAM DANDALA
Printed at Spandana Offset Printers, Suryaroapet,
VJA-2. Ph:2430148, For Spandana Graphics &
Published from # 30-3-13, Durga Agraharam, Vijayawada - 2.

# స్పందన ప్రతిస్పందన





**ప్రయోజనం**

డియర్ ఎడిటర్, "స్పందన" పత్రిక మాకు పంపిస్తున్నందుకు కృతజ్ఞతలు. ఈ నవంబర్ పత్రిక అందినది. పత్రికలోని విషయాలు మా ఆధ్యాత్మిక జీవితాలకు ప్రయోజనకరంగా ఉన్నాయి. దేవుడు మీ పత్రికా పరిచర్యను అత్యధికంగా అభివృద్ధి పరచాలని దేవుని ప్రార్థిస్తున్నాము.

**డా॥ ఎ.షాలేమ్ ఇశ్రాయేలు, విశాఖపట్నం.**

**బలపరచబడ్డాను**

దేవ అన్నగారికి దేవుని ప్రేమతో వందనములు. అన్నయ్య నేను స్పందన కార్యక్రమము చూస్తున్నాను. మీరు చెప్పే వాక్యం ద్వారా ప్రతిసారి ఎంతో ఆదరింపబడుతున్నాను. పడిపోయిన స్థితిలో చాలా శూన్యంతో నిండిన నా హృదయంతో ఉన్న నేను ఒకరోజున టీ.వీ లో మీ కార్యక్రమం చూసినపుడు మీరు చెప్పిన వాక్యం ద్వారా దేవుడు నన్ను బలపరచాడు.

**అన్నపూర్ణ, అనంతపురం.**

**అభినందనలు**

ప్రభువునందు ప్రియులు, దైవసేవకులు స్పందన బృందమందరికి వందనాలు మీ యొక్క నిర్విరామ కృషికి ఎంతో అభివందనములు. మెదడుకు మేత, గ.ను.క ఆధ్యాత్మిక ఆహారముగా, ఎంతో ఉత్సాహాన్ని కలిగిస్తున్నాయి.

**జె.సరోజిని, రాజమండ్రి.**

**ఆధ్యాత్మిక మేలులు**

ప్రభువునందు ప్రియులైన దేవసహాయం బ్రదర్ గారికి వందనములు. ప్రభువు కృపలో మీ స్పందన టీ.వీ కార్యక్రమం ద్వారా, పత్రిక ద్వారా నేను ఆధ్యాత్మిక మేలులు పొందుచున్నాను.

**బి.విజయలక్ష్మి, తెనాలి.**

**స్పందింపజస్తోంది**

ప్రభువైన యేసుక్రీస్తు నామమున వందనముతో వ్రాయునది మీ యొక్క స్పందన టీ.వీ పరిచర్య యందలి వాక్యమును మేము క్రమము తప్పకుండా వీక్షిస్తున్నాము. మా కుటుంబము ఎంతో ఆదరణ పొందుతూ ఉన్నది.

**ఇ.వి.యం.రాజు, ప్రత్తిపాడు.**

**ఉజ్జీవవైన పాటలు, వాక్యం**

గౌరవనీయులైన ఆరార్కే గారికి హృదయ పూర్వక వందనాలు. మీరు స్పందన పత్రికలో ఎంతో చక్కని అంశములు మాకు తెలియపరుస్తున్నారు. చాలా వందనములు.

**శారాఅబ్రాహం, కాకినాడ.**

**గుణపాఠం**

స్పందన బృందం వారికి నా హృదయపూర్వకమైన వందనాలు. స్పందన మాసపత్రిక నా ఆత్మకు ఎంతో మేలును, ఆనందాన్ని కలిగిస్తుంది. మీ పత్రిక ద్వారా చాలా విషయాలు అర్థమగుచున్నవి. రేడియోద్వారా పేతురు పత్రిక వాక్యం వింటూ మేలు పొందుకుంటున్నాను.

**సి. హెచ్.వెంకటేశ్వర్లు, జంపాల**

**ఆశ**

ప్రభువునందు ప్రియమైన స్పందన సంపాదకులకు క్రీస్తునామములో వందనాలు. మీరు ప్రచురిస్తున్న స్పందన మాసపత్రికను నేను ఒకరి దగ్గర చూచాను. చాలా బాగుంది. నేనుకూడా పత్రిక తెప్పించుకోవాలని కోరికను ప్రభువు నాకు కల్పించారు.

**ఎన్.అంజయ్య, గుంటూరు**

# సంపాదకీయం....

**యేసు** కన్యక గర్భాన పరిశుద్ధాత్మ శక్తిచేత జన్మించాడు. కావున దేవ నరుడు. మరియ యేసు మానవతను గర్భం ధరించింది. యేసు నజరేతులో పెరిగాడు. మరియ యోసేపుల పిల్లవాడుగా మాత్రమే కాదు. ఆయన అసలు గుర్తింపు దేవుని కుమారుడు. యేసుప్రభువు తన పన్నెండవ యేట చెప్పినమాట ***"నేను నా తండ్రి పనిమీద వచ్చాను. అదే పనిమీద ఉంటాను."*** తాను వచ్చిన పని, తన తండ్రి చిత్తం ఇవే ఆయనకు అన్నపానాలు. యేసు బాప్తీస్మం పొందాడు. తండ్రి కుమార పరిశుద్ధాత్మలు ఒకచోట సమావేశమయ్యారు.

తండ్రి అన్నాడు – ఇదిగో నా ప్రియ కుమారుడు, ఈయనయందు నేను ఆనందిస్తున్నాను. యేసు మానవులకు వచ్చే శోధనలన్నింటిని గెలిచాడు. ఆదాము సైతాను శోధనలకు లొంగిపోయాడు కాని యేసు కడపటి ఆదాము. ఈయన గెలిచాడు. యేసు బోధించాడు. ఆయన ప్రబోధాలు అధికారపూర్వకమైనవి. యేసు తన మాటలో, చేతలో దైవశక్తిని కనబరిచాడు. యేసు మేలు చేస్తూ సంచరించాడు. కాని తన 33వ యేట సిలువమీద లోక పాపాల నిమిత్తం బలియాగమైపోయాడు. యేసు చేసిన పనులలో విమోచనాత్మక విలువలు నిక్షిప్తమై ఉన్నాయి. యేసు దేవుని రాజ్యాన్ని ప్రకటించాడు. కొండమీది ప్రసంగం యేసు రాజ్యప్రణాళిక. యేసు అన్నాడు – నేను లోకానికి ఉప్పును, వెలుగును. ఈ ఉప్పుతింటే నీతికోసం దప్పి ఎక్కువవుతుంది. ఈ వెలుగు చీకటికి తీర్పు తీరుస్తుంది. ప్రియ సోదరీ, సోదరులారా! ఈ యేసు మీలో ప్రతి ఒక్కరికి కావాలి. ఆయన్ను మీ గుండె గుడిలో ప్రతిష్టించుకోండి. అపో.కా. 16:31. యేసుక్రీస్తు దేవ నరుడు. దేవుడే మానవజన్మ ఎత్తాడు. యేసు బెత్లెహేములో పుట్టాడు. యేసు దేవుడు అభిషేకించి పంపిన మెస్సీయా. జ్ఞానులు యేసురాజును సందర్శించి కానుకలిచ్చారు. వారు తెచ్చిన కానుకలు మౌనభాషలో యేసు వ్యక్తిత్వాన్ని ఆయన సౌశీల్యాన్ని ప్రకటిస్తున్నాయి. బంగారం దేవత్వాన్ని పరిశుద్ధతను సూచిస్తుంది. సాంబ్రాణి పరిమళ సువాసనకు సంకేతం. బోళం యేసు మరణాన్ని చూపుతుంది. బోళం మరణించిన వారిని సమాధి చేసేటప్పుడు వాడతారు. అంతేకాదు బంగారం తెచ్చిన జ్ఞానులు, సాంబ్రాణి తెచ్చినవారు యాజకులు, బోళం తెచ్చినవారు వైద్యులు. యేసుక్రీస్తునందు ఈ మూడు పరిచర్యలు ఏకీభవించాయి. కేంద్రీకరించబడ్డాం.

మానవత అనే పొత్తి గుడ్డల్లో చుట్టబడిన శిశువు యేసు! మనుష్యుల బ్రతుకుల్లో విద్వేషం, కపటం, కార్పణ్యం, రోగం, రొష్టు, దేవదూషణ గూడుకట్టుకొని ఉన్నాయి. తండ్రి ప్రేమ నెరుగని పాపిష్టిలోకమిది. నిర్జీవ ప్రపంచం, చీకటి కోణం. దేవుడు "యేసు అవటంలో ఎంత వెల చెల్లించాల్సి వచ్చిందో గమనించండి. క్రిస్మస్ నుండి ఈస్టరు వరకు ఒకే సరళరేఖ. శిశు ప్రసూతినుండి శుభ శుక్రవారం వరకూ ఒకే కృపారేఖ".

దైవాశీస్సులు.

క్రీస్తునందు భవదీయుడు – ఆరార్కే

# మనలో మాట...

క్రీస్తునందు ప్రియపాఠకులకు,

**'సర్వోన్నతమైన స్థలాలలో దేవునికి మహిమ ఆయనకిష్టులైన ప్రజలకు భూమి మీద సమాధానము కలుగును గాక!'** లూకా 2:14 లోని శ్రేష్టమయిన లేఖన వాక్యాలతో మీకు క్రిస్మసు, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.

ప్రతినెలా స్పందన ద్వారా మిమ్మును కలుసుకునే ఈ దివ్య అవకాశం కోసం ఎల్లప్పుడూ నేను దేవునికి స్తోత్రాలు సమర్పిస్తూ ఉంటాను. మన జీవితాల్లో మరో క్రిస్మసును, నూతన సంవత్సరంలో ప్రవేశించే భాగ్యాన్ని ప్రభువు ప్రసాదించినందుకు దేవునికి స్తుతులు, స్తోత్రములు సమర్పిద్దాము. అవును, కదా! ఎందరో ఈ రోజును చూడలేకపోయారు, అంతే కాదు ప్రభువునందు ఆనందించలేని స్థితిలో చాలమంది ఉన్నారు. అయితే క్రిస్మసు మనకిచ్చిన గొప్ప ఆశీర్వాదమేమంటే ప్రతి పరిస్థితుల్లో మనం ప్రభువునందు ఆనందించగలము.

గతాన్ని గురించి గొప్పలు చెప్పుకోవటం చాలామందికిష్టం. ఆత్మసంబంధమైన విషయాల్లో కూడా గతకాలపు అనుభవాలు చెప్పుకుని తృప్తిపడుతూ ఉంటారు కొందరు. యేసుక్రీస్తు కాలం నాటి మత నాయకులు మాట మాట్లాడితే మా తండ్రియైన అబ్రాహాము, మోషే ధర్మ శాస్త్రము ఇలా చెబుతుంది, అని ప్రభువుతో వాదించేవారు.

క్రిస్మసును మనం ఆచరించవచ్చా? లేదా? చాలామంది అడుగుతుంటారు, కారణమేమంటే క్రిస్మసు తేదీ గాని, ఆదిమ సంఘం క్రీస్తు జన్మ దినాన్ని ఆచరించినట్టు గాని లేఖనాలలో మనకు ఎలాంటి ఆధారాలు లేవు. ప్రభువు మరణాన్ని జ్ఞాపకం చేసుకొమని లేఖనాల్లో ఉంది గాని జన్మను గురించి జ్ఞాపకం చేసుకోవాలని ఎక్కడా మనం చదవము. అంతే కాదు క్రిస్మసును డిసెంబరు 25వ తేదిన నిర్ణయించటం కూడా అన్యమతాలలో నుండి వచ్చిన విషయమని బైబిలు పండితులు చెబుతుంటారు. సరే, అది వేరే అంశమనుకోండి! అయితే మనం గుర్తుంచుకొని దేవుణ్ణి స్తుతించి, ఆరాధించే విషయమేమంటే **'తన ప్రజలను వారి పాపముల నుండి ఆయన విడిపించటానికి'** ఏదో ఓ రోజున ఈ లోకంలో మానవుడుగా ఆయన అరుదెంచాడు. అయితే చరిత్రలోనికి ప్రవేశించిన యేసు ప్రకటన 3:20 ప్రకారం నీ హృదయంలోకి ప్రవేశించిన రోజే మన జీవితాలకు నిజ క్రిస్మస్!

అయితే క్రిస్మస్ జరిగిపోయిన సంఘటన! జరగాల్సిన సంఘటన యేసు ప్రభువు రెండవ రాకడ! క్రిస్మసును జరుపుకునే మనం ఆయన రెండవ రాకడకు సిద్ధంగా ఉన్నామా?

దేవుని వాక్యాన్ని మనం జాగ్రత్తగా గమనిస్తే క్రిస్మసు గాథలో 'ఆయన రాకడ కోసం ఎదురు చూచినవారు' అనేకమంది ఉన్నారు. భక్తిగలవారు, మలాకి 3:16, 17లోని **'యెహోవా యందు భయభక్తులు గలవారు'** మెస్సియా రాకడ కోసం ఎదురు చూచారు. గ్రీకు భాషలో ఓ చక్కని మాటుంది 'Prosdechomai' ప్రోస్డేఖోమై – ఆ మాటకు అర్థం ***'స్వాగతించటానికి నేను సిద్ధంగా వేచి ఉన్నాను'*** అని అర్థం, అలాంటి అనుభవమున్న కొందరిని మీ దృష్టికి తెస్తాను.

**1) ఇశ్రాయేలు ఆదరణకోసం కనిపెట్టిన** భక్త **సుమయోను** పేరుకు అర్థం 'వినుట' – అది ఒక వైఖరి. **లూకా 2:25**

**2) యెరూషలేములో విమోచన కోసం కనిపెట్టిన** ప్రవక్తి **అన్న.** ఆ పేరుకు అర్థం 'కృపగల' – అది ఒక లక్షణము, గుణము. **లూకా 2:38**

**3) దేవుని రాజ్యము కోసం కనిపెట్టిన** అరిమతయి **యోసేపు,** ఆ పేరుకు అర్థం 'Adding కలుపుట' అది చురుగ్గా, జాగ్రత్తగా ఉండటమని అర్థం. **లూకా 23:51**

***తీతు 2. 12, 13*** *సెలవిస్తోంది.* ***– మనము భక్తిహీనతను, ఇహలోక సంబంధమైన దురాశలను విసర్జించి, శుభప్రదమైన నిరీక్షణ నిమిత్తము అనగా మహా దేవుడును మన రక్షకుడైన యేసుక్రీస్తు మహిమయొక్క ప్రత్యక్షత కొరకు ఎదురు చూచుచు ఈ లోకములో స్వస్థబుద్ధితోను, నీతితోను, భక్తితోను బ్రదుకుచుండ వలెనని మనకు బోధించుచున్నాది.***

(తరువాయి 25వ పేజిలో)

## ఈ మాసపు ప్రసంగం



**- ఆచార్య ఆరార్కే**

# క్రిస్మస్

**యెషయా** ప్రవక్త 9:6 నుండి 7 వరకు యేసుక్రీస్తును ప్రవచనాత్మకంగా వర్ణించాడు. మనకు శిశువు పుట్టాడు. కుమారుడు అనుగ్రహించబడ్డాడు. ఆయన భుజం మీద రాజ్యభారం ఉంటుంది. ఆశ్చర్యకరుడు. ఆలోచన కర్త. బలవంతుడైన దేవుడు. నిత్యుడైన తండ్రీ, సమాధాన కర్త అయిన అధిపతి అని అతనికి పేరు. ఆయన వచ్చి దావీదు సింహాసనాన్ని రాజ్యాన్ని నియమిస్తాడు. అపరిమితమైన వృద్ధి క్షేమము కలిగిన రాజ్యమది. ఆయన సింహాసనాసీనుడై పరిపాలన చేస్తాడు. స్థిరమైన రాజ్యం నీతి, న్యాయము చేకూర్చే రాజ్యం. యేసుక్రీస్తు యిహ పరాలలో ఆశ్చర్యకరుడు. క్రీస్తు పుట్టక మునుపు 740 సం॥రాల క్రిందట యెషయా ఆశ్చర్యకరుడైన యేసును చూచాడు. ప్రవచించాడు. యేసు అందరిలో అతి ఆశ్చర్యకరుడు. పాత నిబంధనలోని భక్తులందరికంటే కొత్త నిబంధనలోని వ్యక్తులందరి కంటే యేసు ఆశ్చర్యకరుడు.

మరియ గాబ్రియేలు ద్వారా వార్త విన్నది. తను దయాప్రాప్తురాలు. సర్వోన్నతుడు ఆమె గర్భవాసాన పుట్టబోతున్నాడు. ఆమెకీ వార్త ఆశ్చర్యమనిపించింది. పరిశుద్ధాత్మ శక్తి వల్ల దేవుడు శిశువై ఆశ్చర్యకరమైన రీతిగా అవతరించాడు. మరియకు అర్థం కాలేదు. కాని ఈ ప్రవచనాన్ని నమ్మింది. యేసు పుట్టేవరకు మరియకు యోసేపుకు వైవాహిక సంబంధం లేదు. దేవుని కాల నిర్ణయం ప్రకారం మరియ యేసును కన్నది. పశులపాకలో యేసు పుట్టాడు. అదే సమయంలో కాపరులకు యేసు పుట్టాడని దేవదూతలు వార్త అందించారు. పరలోక గాయకులు పాటలు పాడారు. క్రీస్తు జన్మ వృత్తాంతాన్ని పాటల రూపంలో ప్రకటించారు. యేసు పుట్టుకతో మానవ చరిత్ర రెండు విభాగాలుగా చీలింది. పశువుల పాకకు వెనక క్రీస్తుపూర్వం. తర్వాత క్రీస్తు శకం. మానవ తండ్రి లేకుండా ఏ శిశువూ పుట్టడు. కాని యేసు పుట్టుక ఆశ్చర్యం. దేవుడే యేసుకు తండ్రి, మరియ తల్లి. కన్యక గర్భధారణ ఆశ్చర్యం, పుట్టుక మరీ ఆశ్చర్యం. పరలోకంలో తండ్రి ప్రక్కన కూర్చుండిన యేసుకు తల్లి లేదు. పశువులపాకలో మరియ



చేతిలో పొత్తిగుడ్డలో పడుకున్న యేసుకు తండ్రి లేదు. ఇది ఆశ్చర్యం ఆత్యాశ్చర్యం. యేసు దేవుడు, మానవుడు కూడా. ఆయనకు తండ్రి దేవుడే. తల్లి మానవమాత్రురాలు. క్రీస్తులో దేవమానవ స్వభావాలు రెండూ ఉన్నాయి. యేసు మనకు రక్షకుడు. మనకూ దేవునికి మధ్యవర్తి. దేవుని ఎదుట మనకు ఉత్తరవాది. గనుక ఆయన దేవుడే. అంతే కాదు మనకు స్నేహితుడు. మనపట్ల సానుభూతి గలవాడు. మన కష్టసుఖాలను అవగాహన చేసుకున్నవాడు. గనుక ఆయన నరుడే. దేవ స్వభావంతో భూమ్యాకాశాలను సృజించాడు.

దేవుడు ఆత్మ. ఆయనను ఆరాధించేవారు ఆత్మపూర్ణులై ఉండాలి. వాక్య సత్యంతో నింపబడి ఉండాలి. లేకపోతే అది ఆరాధనా కాదు. వారు ఆరాధికులూ కాదు. క్రీస్తునందలి విశ్వాసమే మనల్ని దేవుని బిడ్డలుగా చేసింది. యేసుక్రీస్తును అంగీకరించు అని దేవునివాక్యం తీర్పు తీరుస్తుంది. వాక్య అధ్యయన అభ్యాసాల ద్వారా మనకు పరిపక్వత వస్తుంది. దేవుని వాక్య అన్వయం మన ఆత్మలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతుంది. విశ్వాసీ, నిన్నే..... ఓ ప్రశ్న అడుగుతున్నాను. నీవు అసలెందుకు ఈ లోకంలో ఉన్నావు? దేవుడు నిన్నెందుకిక్కడ ఉంచాడు? ఆయన ఉద్దేశ్యమేమిటి? యేసు ఎవరికి ప్రభువో, రక్షకుడో వారిదే పరలోకం. దేవుడ్ని ప్రేమించి అర్థవంతంగా ఆరాధించాలంటే విశ్వాసికి బైబిలు క్షుణ్ణంగా తెలిసి వుండాలి. ఆధ్యాత్మిక ఎదుగుదలతోపాటు పరలోక ఆశీర్వాదాలన్నీ వస్తాయి. యేసు మనను అంటే ఏమిటి? బైబిలాలోచనలు, వాక్యపు తలంపులు, దేవుడి అభిప్రాయాలు! బైబిలును ఆలోచించగలిగితే అవే యేసు తలంపులు! ఎఫెసీ 1:3 పరలోక విషయాలలో ఆత్మసంబంధమైన ప్రతి ఆశీర్వాదము! అంటే వాక్యములోని ప్రతి ఆలోచన, ప్రతి తలంపు ప్రతి భావమూ! అంతా దేవుడు తనకిచ్చాడు. దేవుని మాటలు నిశ్చలమైనవి. సంఘ యుగారంభాన్ని ప్రభువు యోహాను సువార్త 14-17 అధ్యాయాలలో ప్రవచించాడు. సంఘం ఉనికికి ధ్యేయం ఒకటే. ప్రభువును మహిమపరచటమే! ఇశ్రాయేలు యేసును తిరస్కరించబట్టే దేవుడు సంఘ యుగాన్ని ప్రారంభించాడు. మేడగదిలో సంఘము యొక్క మొదటి జన్మదినమిది. పరిశుద్ధాత్మ నేతృత్వంలోనే సమస్తకార్యాలు జరగసాగాయి. ఇదే సంఘయుగం ప్రత్యేకత. పరిశుద్ధాత్మ చెప్పేవి యేసు మాటలే. చేసేవి యేసుకార్యాలే! సంఘం యేసు శరీరమే! పరిశుద్ధాత్మ యేసుకు "ఎగ్జిక్యూటివ్". సంఘ యుగమంతా పరిశుద్ధాత్మ నిర్వహణే! ఆయనే పర్యవేక్షకుడు. కళంకము, ముడత, మచ్చ లేకుండా సంఘ వధువును పరిశుద్ధాత్మే తీర్చి దిద్దుతున్నాడు. ఒకానొక రోజున ఈమెను మధ్యాకాశంలో యేసు వరునికి అప్పగిస్తాడు. యేసు ప్రేమను పెంచుకొని, పంచుకొనేవారే



సంఘబిడ్డలందరూ! సంఘం యేసు ప్రేమయందు నిలిచి ఉంటుంది. మనమంతా సంఘ యుగీనులం! విశ్వాసులం!

**"ఒక్కొక్క మెట్టే ఎక్కాలి,**
**మెట్టును గట్టిగా తొక్కాలి**
**యేసు శిష్యుల పాద**
**ఘట్టన, భూమిని కదిలిస్తుంది**
**సైతానును వణికిస్తుంది"**
**దైవాశీస్సులు**



డా॥దేవసహాయం దండల

# కాపరులకే ఎందుకు?

**దేవుడు** చేసే అద్భుత కార్యాలు గమనించండి. పామరులైన ఈ గొర్రెల కాపరులకే ఎందుకు ఈ శుభవర్తమానము చెప్పబడింది? ఆశ్చర్యమైన విధానంలో దేవుని మహిమ వారి మధ్యలో ఎందుకు ప్రకాశించింది? మిగతావారెవరికీ కాకుండా కేవలం ఈ గొర్రెల కాపరులకే దేవుని మహిమ ప్రకాశించటం, ఈ ప్రత్యేకించబడిన వారికే తనను తాను ప్రత్యక్షపరచుకోవటం ఆశ్చర్యం కాదంటారా? దేవుడు ఎందుకు వారిని ఎన్నుకున్నాడు?

బైబిలు గ్రంధాన్ని మనం జాగ్రత్తగా ధ్యానిస్తే గొర్రెల కాపరుల విషయం దేవుడు ఓ ప్రత్యేకమైన శ్రద్ధ వహించాడు. ఆదాము కుమారుడైన హేబెలు **గొర్రెల కాపరి.** అబ్రాహాము కుమారులయిన ఇస్సాకు, యాకోబులు **గొర్రెల కాపరులు.** ఐగుప్తులో ఇశ్రాయేలు పిల్లలు **గొర్రెల కాపరులు.** ఫరో రాజమందిరంలో యువరాజుగా పెరిగిన మోషే నలభై సంవత్సరాలు **గొర్రెల కాపరిగా** ఉండాల్సి వచ్చింది. దేవుని హృదయానుసారుడైన దావీదు కూడా **గొర్రెల కాపరి.** ప్రవక్త ఆమోసు **కాపరి.** అంతెందుకు? ప్రభువైన యేసుక్రీస్తు **'మంచి కాపరి', 'గొప్ప కాపరి', ప్రధాన కాపరి'** గా పిలువబడ్డాడు. అపోస్తలుడైన పేతురు వృత్తిరీత్యా జాలరి, ఆయన **'కాపరి'** గా నియమించబడ్డాడు. ఎందుకంటే ప్రభువైన యేసు 'నా గొర్రెలను మేపు' అని పేతురుతో చెప్పాడు.అంత మాత్రమేనా..కాదు, **అన్వయించుకుందాం!**

సంఘములో కాపరులు, పెద్దలు, పరిచారకులు చేయాల్సినది కాపరి పనే! దేవుడు కాయమని మనకిచ్చిన మందకు మనం కాచేవారంగా ఉండాలి. స్వచ్ఛమైన ఆధ్యాత్మిక ఆహారంతో మందను పోషించాలి. దేవుని రాజ్యవిస్తరణ కోసం మందను మంచిచోట్లకు నడిపించాలి. దేవుడు రక్షించిన ప్రతి ఒక్కరూ క్రీస్తు రాయబారులు, అంటే ఆధ్యాత్మికంగా శిశువులుగా ఉన్న విశ్వాసులను పోషించే బాధ్యత నీకివ్వబడిందని గుర్తించాలి. దేవుని రక్షణను గురించిన జ్ఞానము నీకివ్వబడింది. కనుక గొర్రెలను,గొర్రె పిల్లలను పచ్చికగల చోట్లకు, రక్షణ బావుల వద్దకు మనం నడిపించాలి. కేవలం మన విషయాలు మనం చూచుకోటానికి మాత్రమే దేవుడు మనల్ను ఈ లోకంలో ఉంచలేదు, మన విషయాలు మన దేవుడు చూచుకుంటాడు. మనం ఇతరులకు సేవచేయటానికి ఈ లోకంలో ఉంచబడ్డాము. గొర్రెలను, గొర్రెపిల్లలను మేపే దానికి, అవసరమైతే వారికోసం మన ప్రాణాన్నయినా ఇచ్చేస్తాము. దావీదు సింహాన్ని ఎలుగుబంటిని ప్రాణాలొడ్డి పోరాడి, చంపాడు, అదీ కాపరి చేసే పని. మందను కాపాడటానికి మనం మిలిటెంట్‌లా పోరాడాలి.

సైతాను ప్రవేశ పెట్టే తప్పుడు బోధలు, తప్పుడు సువార్తనుండి మందను కాపాడుకోవాలి. అందుకు ఈ మహిమను కాపరులకు దేవుడు ముందుగా



తెలియజేశాడు.

మందను మనం రాత్రివేళ కాస్తున్నట్టున్నాము. కారణం ఈ లోకం ఆధ్యాత్మిక అంధకారంలో ఉంది. సైతాను ప్రభావంలోని చీకటి. ఇప్పుడు తరువాతి వచనాన్ని చూద్దాం!

## ప్రభువు దూత – మన ప్రభువుకు మరో పేరు

(లూకా 2:9-10, నిర్గమ 3:2; 20:2; యూదా 1,2; ప్రకటన 1:16; హెబ్రీ 13:8; యోహాను 6:44; మత్తయి 1:21)

లూకా 2:9-10

ఇదిగో ప్రభువు దూత వారి మీదకు వచ్చెను, ప్రభువు మహిమ వారి చుట్టూ ప్రకాశించెను గనుక వారు భయపడిరి. అయితే దూత వారితో, భయపడకుడి, ఇదిగో ప్రజలందరికి కలుగబోవు మహా సంతోషకరమైన సువర్తమానమును మీ కొరకు తెచ్చియున్నాను.

బైబిలులో 64 సార్లు ప్రభువు దూత ప్రత్యక్షతను ప్రస్తావించబడింది. ప్రభువు దూత అంటే ఎవరని మనం అర్థం చేసుకోవాలి?

నిర్గమ 3:2 లో మండుచున్న పొదలో ప్రభువు దూత మోషేకు ప్రత్యక్ష మయ్యాడు. ఆ తరువాత జరిగిన సంఘటన, విషయమంతటిలో మోషేతో మాట్లాడినది ఒక దూత కాదని ప్రభువే మోషేతో మాట్లాడాడు అని అర్థంచేసుకుంటాము. న్యాయాధిపతులు 2:1 లో ప్రభువు దూత ఇశ్రాయేలుతో మాట్లాడుతూ అన్నాడు. **''నేను మిమ్మును ఐగుప్తులో నుండి రప్పించి మీ పితరు లకు ప్రమాణము చేసిన దేశమునకు మిమ్మును రప్పించి....'** మనం అర్థం చేసుకోవచ్చు మాట్లాడుతున్నది దూత కాదు ప్రభువే మాట్లాడుతున్నాడు. నిర్గమ 20:2 'నీ దేవుడైన యెహోవాను నేనే, నేనే దాసుల గృహమైన ఐగుప్తు దేశములో నుండి మిమ్మును వెలుపలికి రప్పించితిని.' దాసులగృహమైన ఐగుప్తు బానిసత్వం నుండి విడుదల కలుగజేసింది ఎవరు? యేసుక్రీస్తు ప్రభువే అలా చేశారు.

సిలువ మీద ఆయన చెల్లించిన వెల పాప బంధకాలనుండి, సైతాను విడుదల, విమోచన కలిగిస్తుంది. అంచేత 'ప్రభువు దూత' అనే మాట లేఖనాల్లో ఎక్కడెక్కడ వినియోగించ బడిందో జాగ్రత్తగా ధ్యానించటం వలన ప్రత్యక్షమయిన ప్రభువు దూత ప్రభువైన యేసే అని అర్థం చేసుకోవాలి. మండుచున్న పొదలో మోషేకు ప్రత్యక్షమయ్యింది ప్రభువైన యేసే, న్యాయాదిపతులు 2:1లో ఇశ్రాయేలీయులతో ఐగుప్తు దాసత్వ విమోచన, బందీగృహ విడుదల గురించి మాట్లాడింది ప్రభువైన యేసే! ఆయన మహిమ వారి చుట్టూ ప్రకాశించింది.

## మహిమ

వారి చుట్టూ ప్రకాశించిన వెలుగు, మహిమ ప్రభువైన యేసుక్రీస్తు వారిది అని ఎలా చెప్పగలము?

ప్రకటన 1:16 గమనిస్తే ఆయన ముఖము మహాతేజస్సుతో ప్రకాశించు చున్న సూర్యుని వలె ఉన్నది. పత్మసు ద్వీపంలో అపోస్తలుడైన యోహానుకు ప్రభువు ప్రత్యక్షమయినపుడు, ప్రకాశ మానమైన ఆ వెలుగు న్యాయాధిపతిగా తన మహిమ తెలియజేస్తుంది. ఈ మహిమ ఆయన జన్మించినప్పటి మహిమతో సమానంగా ఉంది. కారణమేమంటే, భూమ్యాకాశాలను సృజించకముందే ఆయన మహిమాన్వితుడైన దేవుడు. హెబ్రీ 13:8 యేసుక్రీస్తు నిన్న నేడు నిరంతరమూ ఒకే రీతిగా ఉన్న దేవుడు. ప్రకటన గ్రంథంలో ప్రభువును చూడగానే యోహాను ఎంతగానో భయభ్రాంతుడయి, చచ్చినవాని వలె పడిపోయాడు. అప్పుడు ప్రభువన్నాడు 'భయపడకు'. ఇది సూర్యకాంతిని పోలిన ప్రకాశమానమైన వెలుగు. గొర్రెల కాపరులకు ఇది ఎంత భయానక దృశ్యమో ఒక్కసారి ఆలోచించండి. అందుకే ప్రభువు వారికి అభయమియ్యాల్సి వచ్చింది. అయితే అంత్యదినాన రక్షణలేని వారికి ఎంతో భయము. కారణం వారి అంతం అగ్ని గంధకాలతో మండేగుండం. అయితే ప్రభువు మనతో అంటున్నాడు. భయపడకు. మనం ఇంకా ఆయన్ను దేవుడిగా రక్షకునిగా ఘనపరుస్తాము, గౌరవిస్తాము, గాని ఆయన్ను న్యాయాధిపతిగా మనకు శిక్షవిధిస్తాడని భయపడాల్సిన పనిలేదు. సిలువలో ఆ తీర్పు జరిగిపోయింది. మనము రక్షింపబడిన వారమైతే నరకానికి మనం భయపడాల్సిన అవసరం లేదు. మనము దేవుని పిల్లలమయ్యాము. వాస్తవానికి మనం నరకానికి పాత్రులము, కారణమేమంటే మనం సైతానుకు, పాపానికి దాసులముగా ఉన్నాము. దేవునికి శత్రువులము. మన హృదయాలు పగలు, ప్రతీకారాలతో నిండి ఉండేవి. అయితే ప్రభువైన యేసుక్రీస్తు మనల్ను రక్షించాడు. అంచేత నరకం మనల్ను భయపెట్టలేదు. ప్రభువు మనల్ను రక్షించి మనలో గొప్ప మార్పు తెచ్చాడు. మన హృదయాలలో ఆయన సన్నిధిని ఎల్లప్పుడూ కలిగియున్నాము.

దైవాశీస్సులు.



ఆర్.ఎలూజై

# ఆదర్శప్రాయులు

**చలికాలం** ఆరంభమవ్వడంతో సాయంత్రపు గంటలన్నీ గడవకుండానే భానుడు పరుగులు పెడుతూ పడమటి కనుమల్లోనికి అదృశ్యమైపోయాడు. రేయి తొలిజాములోనే చిక్కని చీకట్లు అంతటా అలుముకున్నాయి. తెల్లని పువ్వుల్లా చెదురుమదురుగా కురుస్తున్న మంచుబిందువులు చల్లదనాన్ని చెవుల్లోనికి చేరుస్తూ, గజగజా వణికించేస్తుంటే, ప్రజలందరూ పెందలకడనే కంబళ్ళ క్రిందకు చేరి నిద్రకు ఉపక్రమిస్తున్న ఆ సమయంలో...

ఖగోళాన్ని అధ్యయనం చేస్తున్న కొందరు మేధావులు మాత్రం ఆ పరిశోదనాలయంలో అంతరిక్ష దర్శిని (Telescope) ముందు ఆసక్తిగా ఆశీనులయ్యారు. గత కొద్దిరోజులుగా ఖగోళంలో క్రొత్తగా కనిపిస్తున్న కాంతివంతమైన నక్షత్రమే వారి ఆసక్తికి మూలకారణం. ఈ విశ్వంలోని గ్రహాలు, ఉపగ్రహాలు అన్నీ వాటివాటి స్థానాల్లో స్థిరంగా ఉంటాయనేది అందరికీ తెలిసిన సత్యం. అయితే ఈ క్రొత్త నక్షత్రం ఇతర నక్షత్రాల వలె స్థిరంగా నుండక, భూమితో పాటు చలిస్తుండడమే (మత్త 2:9) వారికి ఆశ్యర్యాన్ని కలిగించింది. ఏళ్ళతరబడి ఖగోళాన్ని అధ్యయనం చేస్తున్నవారా వ్యక్తులు. ఇంతకు ముందెన్నడూ కనిపించని ఆ తార ఇప్పుడు ఆకాశంలో కనిపించడం, భూమిపైగల ఒక ప్రదేశానికి అనుగుణంగా చలించడం, ఇవన్నీ గమనిస్తుంటే, కారణజన్ముడెవరో ఈ లోకంలో (అంటే ఆ ప్రదేశంలో) జన్మించాడనివారికి సులభంగానే అర్థమయ్యింది. అయితే ఆ ప్రదేశమెక్కడుందనేదే వారి ప్రస్తుత సమస్య!

వారు తూర్పుదేశంలో నివసిస్తున్నారు గనుక, చాలా దేశాలకన్నా ముందే వారికి చీకటి పడుతుంది. మరికొంచెం సమయానికి ఆకాశంలో ఆ తార వెలుగులను జ్వలిస్తుంది. తారను చూస్తూ రాత్రంతా ప్రయాణం చేయడమనేది అంత సులభమైన విషయమేమీ కాదు. అసలు అటువైపు మార్గమే ఉండకపోవచ్చు. అందుకే వారంత ఆసక్తిగా (అంతరిక్ష దర్శినిలో) ఆ నక్షత్రాన్ని గమనిస్తూ, అది నిలిచిన ప్రదేశానికి, తామున్న ప్రదేశానికి మధ్యనగల దూరాన్ని, దిశను గణనం చేయడం ప్రారంభించారు.

'ఆ ప్రదేశమెక్కడుందో తెలుసుకోవడం సులభమే' యువశాస్త్రవేత్త వివరించడం మొదలుపెట్టేసరికి అంతా అప్రమత్తులయ్యారు. 'ముందుగా ఆకాశంలో ఆ నక్షత్రం ఎంత కోణంలో కనబడుతుందో లెక్కకట్టగలిగితే, భూమికి పైన అది ఏ స్థలంపై నిలిచి ఉందో అక్కడికి, మన ప్రాంతానికి మధ్యన గల దూరాన్ని అంచనా వేయవచ్చు' ఇంకా



వివరంగా చెప్పడం ప్రారంభించాడా వ్యక్తి.

ఉదాహరణకు మనం తలఎత్తి నక్షత్రాన్ని 60° డిగ్రీల కోణంలో చూస్తున్నామనుకుంటే, దూరాన్ని లెక్కకట్టడం ఇలా సాధ్యమవుతుంది.

1) భూమికి అతిదగ్గరగా ఉన్న, నక్షత్రానికి, భూమికి మధ్యన గల దూరం మనకు తెలుసు గనుక ఆ విలువను అంచనాలోనికి తీసుకోవచ్చు. లేదా కాంతి వేగాన్ని ($3\times10^{10}$ cm/sec) బట్టి ఈ క్రొత్త నక్షత్రం భూమికి పైన ఎంత ఎత్తులో ఉందో లెక్కించవచ్చు. (సూర్యకాంతి భూమిని చేరడానికి 8 నిముషాలు పడుతుంది.)

2) ఉదాహరణకు ఈ దూరాన్ని మనం 100 కి.మీ అనుకుందా.

3) A అనేది నక్షత్రమని, B ప్రయోగశాల అని, C అనేది మహనీయుడు జన్మించిన స్థలమని భావిస్తే..

4) పటంలో చూపిన విధంగా C అనేది రెండు ప్రదేశాల మధ్యన దూరం అవుతుంది.

5) గణితశాస్త్ర సిద్ధాంతాల ప్రకారం $AC \div BC = \tan 60^o = BC = AC \div \tan 60^o = 100 \div 3$ 58 కి.మీ.




ఇలా ఖచ్చితమైన విలువలతో లెక్కిస్తే మనమున్న స్థలానికి, మహనీయుని జన్మస్థలానికి మధ్యన గల దూరం తెలుసుకోవచ్చు. అయితే భూమి సమతలంగా కాక, గోళాకారంగా ఉంటుంది గనుక, ఈ పద్ధతిలో కొంత తేడా వచ్చినా, ఒక అంచనా మాత్రం తప్పకుండా తెలుస్తుంది. ఆ తరువాత నక్షత్రం కనిపిస్తున్న దిశలో ఉన్న దేశాలను గ్లోబుపై గుర్తించగలిగితే, ఆ ప్రాంతాలలోనే ఆయన జన్మస్థలం ఉంటుంది.' అతడు వివరణ ముగించగానే చప్పట్లతో మార్మోగిపోయిందా కార్యలయం.

లెక్కలన్నీ ఒక కొలిక్కి వచ్చాయి. సిద్ధపరచుకున్న ఖచ్చితమైన సమాచారంతో ఆ జ్ఞానులు (మత్తయి 2:1) యెరూషలేము చేరుకున్నారు. (ఇంకా కొంచెందూరం ప్రయాణం చేయాల్సి ఉండనగా తొందరపాటుతో, దేవుడిచ్చిన జ్ఞానాన్ని, అవగాహనను ప్రక్కనపెట్టి, ఇతరుల ఆలోచనలపై ఆధారపడి దారితప్పినా) చివరికి ఎలాగైతేనేం బేత్లెహేము చేరుకున్నారు. దైవకుమారుని దర్శించుకున్నారు. ధన్యులై తమ దేశానికి తిరిగి చేరుకున్నారు.

వారి జ్ఞానాన్ని గూర్చి ఆలోచిస్తుంటేనే ఆశ్చర్యమనిపిస్తుంది. పైనుదహరించిన గణన విధానాలన్నీ ఊహాజనితమే కావచ్చు. నిజానికీ విధానాలేవీ వారు ఉపయోగించి ఉండకపోవచ్చు. కానీ మిణుకుమిణుకుమంటూ మెరుస్తున్న ఒక చిన్న నక్షత్రాన్ని గమనించి, అది ఎందుకు జనించిదో గ్రహించి, యేసు జనన స్థలాన్ని గణించి, ఆసక్తితో అక్కడకు పయనించి, యేసును పూజించిన ఆ జ్ఞానుల జ్ఞానమెంత గొప్పదో! ఆలోచిస్తుంటే మదిలో మెదిలింది సోక్రటీసు వృత్తాంతం.

ఒకరోజు కొందరు వ్యక్తులు సోక్రటీసు వద్దకు వచ్చి, 'అయ్యా! ప్రజలెందుకు మిమ్మును జ్ఞాని అంటారు. ఇతర మేధావులకన్నా మరేవిధంగా గొప్పవారు?' అని ప్రశ్నిస్తే, సోక్రటీసు ఇలా సమాధానం చెప్పాడట. “వారికేమీ తెలీదని వారికి తేలీదు. నాకేమి తెలీదని నాకు తెలుసు. ఆ ఒక్క విషయంలోనే నేను వారికన్నా మెరుగైన వాడను. (They don't Know that they don't Know. I Know that I dont Know.) అసలైన జ్ఞాని దేవుడే. ఆయన జ్ఞానమే గొప్పదని తెలుసుకునే వాడెవడైనా గొప్పవాడే' అన్నాడట. అదండీ సంగతి. దైవాన్ని కనుగొనడానికీ, ఆ దైవాన్ని చేరుకోవడానికీ మానవుడు తనకున్న బుద్ధికుశలతను వినియోగిస్తే వాడు జ్ఞాని అవుతాడు. లేకుంటే అజ్ఞానిగానే మిగిలిపోతాడు. అందుకే నేస్తం! తస్మాత్ జాగ్రత్త! దేవుడు లేడని బుద్ధిహీనులు తమ హృదయములో అనుకొందురు (కీర్త14:1) అని సెలవిస్తుంది బైబిలు గ్రంథం. అలాంటి కొందరు సహితం తమ జీవిత చరమాంకంలో తాము ప్రతిపాదించిన సిద్ధాంతాలన్నీ వట్టి రాద్ధాంతాలేనని చెప్పి మరీ చెక్కేశారు. అందుకే నేస్తం! నీకున్న జ్ఞానంతో నిజదేవుడిని నీవు తెలుసుకోవాలి. చరిత్రలో నీవెప్పటికీ జ్ఞానిగానే నిలిచిపోవాలి. అందుకు ఆ జ్ఞానులే మనకు ఆదర్శప్రాయులు.



డా॥ యేలూరి ఆశీర్వాదం

# యూదా బేత్లెహేమీయుడు

**"క్రీస్తు దావీదు సంతానములో పుట్టి, దావీదు ఉండిన బేత్లెహేమను గ్రామములో నుండ వచ్చునని లేఖనము చెప్పుటలేదా"**
**(యోహాను 7:42)**

పాఠక మహాశయులకు క్రిస్మస్ శుభాకాంక్షలు, వందనములు.

## క్రీస్తు లేఖనపురుషుడు

ప్రభువైన యేసు ప్రవచనపురుషుడు, లేఖన పురుషుడు, యుగపురుషుడు, శకపురుషుడు, చారిత్రాత్మక పురుషుడు.. (2 కొరిం 11:1) (పదివేల మంది పురుషులలో అతని గుర్తింపవచ్చును)

## జన్మస్థల ప్రవచనము

హేరోదు రాజు ప్రధాన యాజకులను, ప్రజలలోనుండు శాస్త్రులను అందరిని సమకూర్చి క్రీస్తు ఎక్కడ పుడతాడని వారిని అడిగాడు. అందుకు వారు 'యూదయ బేత్లెహేములోనే' అన్నారు. ఎందుకంటే యూదయ దేశపు బేత్లెహేమా! నీవు యూదా ప్రధానులలో ఎంతమాత్రమును అల్పమైనదానవు కావు. ఇశ్రాయేలను నా ప్రజలను పరిపాలించు అధిపతి నీలోనుండి వచ్చును. అని మీకా ప్రవచించాడు. అది అక్షరాలా నెరవేరింది. యూదా అనగా స్తుతి. బేత్లెహేము అనగా రొట్టెల ఇల్లు.

## యెషయా ప్రవచనము

క్రీస్తు పూర్వము (740-640)లో యెషయా అను దీర్ఘదర్శి "ప్రవక్త కన్యక గర్భాన కుమారుడు జన్మిస్తాడు, ఆయనకు ఇమ్మానుయేలు అను పేరు పెడతారు" అని ప్రవచించాడు. ఇమ్మానుయేలు అనగా దేవుడు మనకు తోడు (మనకు తోడైయున్న దేవుడు) అని అర్థము. ఆ ప్రవచనము కూడా నెరవేరింది. శిశువు ఎవరో ప్రవచించాడు. కుమారుడ అనుగ్రహింపబడెను. ఆయన రాజులకు రాజు, ప్రభువులకు ప్రభువు, భూపతులకు అధిపతి, (రాజ్యభారము మోస్తాడు) ఆయన బలవంతుడైన దేవుడు,నిత్యుడగు తండ్రీ, సమాధానకర్తయగు అధిపతి.

## చిగురు

యెష్షయి మొద్దునుండి చిగురు పుట్టును. వాని వేరుల నుండి అకురము ఎదిగి ఫలించును. చిగురు అను నా సేవకుని రప్పింపబోవుచున్నానని జెకర్యా ప్రవచించాడు. 'ఆ దినములలో , ఆ కాలమందే నేను దావీదునకు 'నీతి చిగురు'ను మొలిపించెదను. అతడు నీతి, న్యాయములను జరిగించును. ఆ దినములలో యూదావారు రక్షింపబడుదురు' అని యిర్మీయా ప్రవచించాడు. "నేను దావీదు వేరు చిగురు సంతానమును, ప్రకాశమానమైన వేకువచుక్కనైయున్నానని ప్రభువైన యేసు చెప్పాడు." (ప్రకటన 22:16)



## ఎవరీ శిశువు

ఆ శిశువు విశేషమేమిటి? ఏలయనగా మనకు శిశువు పుట్టెను అని యెషయా వ్రాసాడు. తూర్పు దేశ జ్ఞానులకు ఆకాశాన ఆయన నక్షత్రము శిశువుండిన చోటుకి మీదుగా వచ్చి నిలుచు వరకు వారికి ముందుగా నడిచెను. వారు ఆ నక్షత్రమును చూచి, అత్యానందభరితులై యింటిలోనికి వచ్చి, తల్లియైన మరియను, ఆ శివువును చూచి, సాగిలపడి, ఆయనను పూజించి, తమపెట్టెలను విప్పి, బంగారమును, సాంబ్రాణిని, బోళమును కానుకలుగా ఆయనకు సమర్పించారు. గాబ్రియేలు దూత ద్వారా యేసు జన్మవార్త వినిన గొర్రెలకాపరులు ఆయనను దర్శించారు, పూజించారు, ప్రకటించారు.

ఆ శిశువును గూర్చి ప్రవక్తలు ప్రవచించారు, లేఖనాలు వ్రాయబడినాయి. పుట్టకమునుపే పేరు నిర్ణయింపబడింది. అది పరలోకమందే. పశువుల పాకచుట్టు పరలోక సైన్యసమూహము (దేవుని దూతలు) దేవుని స్తోత్రగానాలు చేసారు. గాబ్రియేలు దూత యేసు జన్మవార్తను దివినుండి భువికి తెచ్చింది. శిశువుగా ఉన్నప్పుడే యుదుల రాజుగా పిలువబడ్డాడు. హేరోదును యెరూషలేమును కలవరపడ్డారు. శిశువును ఎత్తికొని వృద్ధ యాజకుడైన సుమెయోను "నాథా నీవు సకల ప్రజల యెదుట నీవు సిద్ధపరచిన రక్షణ కన్నులారా చూచితిని. నీ చేతుల మీదుగా నీ దాసుని పోనిచ్చు చున్నావు" అన్నాడు. జెకర్యా, ఎలీసబెతు, కన్యమరియలు శిశువును గూర్చి ఆత్మపూర్ణులై ప్రవచించిరి. ఆ శిశువు పరలోకప్రభువైన యేసుక్రీస్తు.

## బేత్లెహేమీయులు

1) యూదా బేత్లెహేము నుండి వచ్చిన యూదా వంశస్థుడైన ఒక యువ్వనుడొకడున్నాడు. అతడు లేవీయుడు, అక్కడ అతడు నివసించేవాడు. ఆ యవ్వనుడు యూదా బేత్లెహేమునుండి బయలుదేరి తనకు స్థలము దొరికిన చోట నివసించడానికి ప్రయాణమై ఎఫ్రాయిమీయుల మన్య దేశముననున్న మీకా యింటికి వచ్చాడు.
2) న్యాయాధిపతులు ఏలినకాలములో యూదా బేత్లెహేము నుండి ఎలీమెలెకు అతని భార్య నయోమిని తన పిల్లలను తీసికొని మోయాబు దేశము వెళ్ళాడు.
3) నయోమి భర్తకు బంధువుడు ఒకడు ఉన్నాడు. అతడు చాల ఆస్థిపరుడు. అతడు ఎలీమెలేకు వంశపువాడు. అతని పేరు బోయజు, మోయాబు దేశమునుండి అత్తతో కలిసి రూతు యూదా బేత్లెహేము వచ్చింది. బోయజు ఆమెను ఆదరించాడు, ప్రేమించాడు, పెండ్లి చేసుకున్నాడు.
4) యెష్షయి కనిష్ఠ కుమారుడు, యూదా బేత్లెహేమీయుడు దావీదు. దావీదు కుమారుడవైన యేసేపూ అని దూత యేసేపుతో అన్నాడు. యేసేపు దావీదు వంశములోను, గోత్రములోను పుట్టినవాడు గనుక ప్రజాసంఖ్యకై గలిలయలోని నజరేతు నుండి యూదా బేత్లెహేమునకు మరియను తీసుకొని వచ్చాడు. యేసు దావీదు కుమారుడని పిలువబడ్డాడు.

## దానియేలు ప్రవచనము

ఆ రాజుల కాలములో పరలోకమందున్న దేవుడు ఒక రాజ్యమును స్థాపించును. దాని కెన్నటికిని నాశనము కలుగదు. అది యుగయుగములు నిలుచును. చేతి సహాయములేని పర్వతమునుండి తియ్యబడిన ఆ రాయి సర్వభూతలమంత పర్వతమయ్యింది.

ఆయన గొప్పవాడై సర్వోన్నతుని కుమారుడన బడును. ప్రభువైన దేవుడు ఆయన తండ్రియైన దావీదు సింహాసనమును ఆయన కిచ్చును. ఆయన యాకోబు వంశస్థులను యుగయుగములు ఏలును. ఆయన రాజ్యము అంతములేనిదై యుండును. అని ప్రభువు పుట్టకమునుపే కన్యమరియకు గబ్రియేలు దూత చెప్పెను.

## యేసు ఎవరు? ఎప్పటివాడు?

అబ్రాహాము పుట్టకమునుపే ఉన్నవాడు. కొండలు పుట్టకమునుపు, భూమికి పునాది లేనపుడు యేసు ప్రధానశిల్పియైయుండెను. (సామెతలు 8:22-31) (యోహాను 8:56-58) ఆయన అన్నిటికంటే ముందున్నవాడు. (కొలస్సీ 1:17) అల్ఫా-ఒమెగ (మొదటివాడు-కడపటివాడు) వర్తమాన, భూత-భవిష్యత్కాలములలో ఉన్నవాడు, మార్పులేనివాడు, నిరంతరము ఒకే రీతిగా ఉన్నవాడు. ఆయన అదృశ్యదేవుని స్వరూపి. సర్వసృష్టికి ఆది సంభూతుడు. సమస్తమునకు ఆధారభూతుడు, సృష్టికర్తయైన దేవుడు. నిజమైన దేవుడు, ఆదియందు వాక్యమైన దేవుడు శరీరధారి ఆయెను. ఆయన ఎందుకు వచ్చాడో యెషయా గ్రంథములో (42:6-7; 61:1-3) వ్రాయబడింది. పండుగ క్రైస్తవులుగా కాక, యేసును గూర్చి తెలుసుకొనిన వారమై, ఆయనను ప్రకటిస్తూ ఆయన రెండవరాకడకొరకు ఎదురుచూస్తూ జీవిద్దాం.



బ్రదర్.కె.పరమానందం

# యూదుల రాజు ఎక్కడ?

**సువార్తికుడైన** మత్తయి యూదులను దృష్టిలో పెట్టుకొని యేసుక్రీస్తును యూదులరాజుగా తెలియపరచాడు. అబ్రాహాము కుమారుడగు దావీదు కుమారుడైన యేసుక్రీస్తు అంటూ యూదుల దృష్టిని అబ్రాహాము, దావీదులపైకి మళ్ళించి-పాతనిబంధన ప్రవచనముల ఉదహరించి వారు శతాబ్ధములనుండి నిరీక్షించిన మెస్సీయా ఈ ప్రభువైన యేసేనని రుజువు చేశాడు. దావీదుకుమారుడుగా ఆయన రాజు – అబ్రాహాము కుమారుడుగా ఆయన బలి ఆయెను (రక్షకుడు) అని వ్రాసాడు.

క్రీస్తు అనగా అభిషక్తుడని – అభిషక్తుడనగా మెస్సీయా అని – యేసు అనగా రక్షకుడని అర్ధమిస్తుంది.

యేసుక్రీస్తు జననకాలమునందు యూదులందరును దేవుని (అభిషక్తుని) క్రీస్తు అనబడు మెస్సియా పుట్టుక కొరకు యెదురుచూస్తున్నారు.

రాజైన హేరోదు దినములలో యూదయ దేశపు బేత్లెహేములో యేసుపుట్టిన పిమ్మట, తూర్పుదేశపు జ్ఞానులు యెరూషలేమునకు వచ్చి, “యూదుల రాజుగా పుట్టిన వాడెక్కడ ఉన్నాడు. తూర్పుదిక్కున మేము ఆయన నక్షత్రము చూచి ఆయనను పూజింప వచ్చితిమి” అని హేరోదు రాజును అడిగారు. కాని హేరోదు రాజు తెలియదన్నాడు.

నక్షత్రము యాకోబులో ఉదయించును, రాజదండము ఇశ్రాయేలులోనుండి లేచును.(సంఖ్యా 24:17) అన్న బిలాము ప్రవచన ప్రకారము జ్ఞానులు యాకోబు నక్షత్రంగా ఆ నక్షత్రాన్ని గుర్తించారు. జ్ఞానులు యెరూషలేమునకు చేరినప్పుడు అక్కడ ఎవ్వరూ మెస్సీయా (క్రీస్తు) కోసం ఎదురుచూడడంగాని, ఆయనకు ఆహ్వానం పలకడంగాని, మాటలాడుకోవడం గాని లేదు. ఎవ్వరూ క్రీస్తు విషయము చెప్పలేకపోయారు. జ్ఞానులు. ఆశ్చర్యపడ్డారు, చింతపడ్డారు. అందువలన రాజుగా పుట్టిన క్రీస్తు రాజుకు తెలియుననుకొని నక్షత్రమును విడిచి హేరోదునొద్దకు వెళ్ళారు.

జ్ఞానులు దేవుని నడిపింపును (నక్షత్రమును) విడిచి తమ ఆలోచన ప్రకారము చేయుట వలన చాలా నష్టము జరిగించారు.(మత్త 2:16) దేవుని చిత్తమునకు ఆయన నడిపింపుకు విధేయులం కావాలి.

దేవుడు క్రీస్తు అనబడు మెస్సీయాను బయలు పరచినప్పటికిని



యూదులు వారి అవిశ్వాసమును బట్టి నమ్మలేకపోయారు. ఈనాడు క్రైస్తవులు క్రీస్తు రక్షకుడని నమ్మి మారుమనస్సు పొందలేకపోవుచున్నారు. యూదులు యేసుక్రీస్తును మెస్సీయగా ఆహ్వానించకపోయినందున దేవుడు తూర్పుదేశమునుండి అన్యులను తీసికొని వచ్చాడు. జ్ఞానులు హేరోదు వద్దనుండి వచ్చి మరలా నక్షత్రము నడిపించిన విధముగా యేసు ఉన్న ఇంటికి వచ్చి పసిబాలుడైన మెస్సీయ పాదముల వద్ద సాగిలపడి పూజించి ఆయనకు వారు తెచ్చిన కానుకలు అర్పించారు. నేడు ఈ సంతోష క్రిస్మస్ సమయములో నీ హృదయములో క్రిస్మస్ ఆనందమునకు కారకుడైన క్రీస్తును రక్షకుడుగా అంగీకరించి ఆరాధించి, పూజించు.

## బేత్లెహేము

మత్తయి తన సువార్తలలో యేసుప్రభువు జన్మ విధానముగూర్చి ఎప్పుడు, ఎక్కడ జన్మించినది వ్రాయలేదు. లూకా తన సువార్తలో ఈ విషయాలు తెలియపరచాడు. (లూకా 2:1-7) యేసేపు దావీదు వంశములో (గోత్రములో) పుట్టినవాడు గనుక తనకు భార్యగా ప్రధానము చేయబడిన గర్భవతియైయున్న మరియతో కూడ ప్రజా సంఖ్యలో వ్రాయబడటానికి బేత్లెహేము అనబడిన దావీదు ఊరికి వెళ్ళాడు. బేత్లెహేము యెరూషలేముకు ఆరు మైళ్ళ దూరము. బేత్లెహేము చిన్న గ్రామము యేసు పుట్టక పూర్వము దానికి అంత ప్రాధాన్యత యేమి లేదు. అటువంటి బేత్లెహేములో ఆయన పుట్టి దానికి విలువను తెచ్చాడు. ఆ ఊరిలో ఏ సత్రములోకూడా స్థలము దొరకక వారు పశువుల పాకలో ఆశ్రయము పొందారు. అక్కడ యేసుకు జన్మనిచ్చింది మరియ. ఆయనను పశువుల తొట్టెలో పరుండబెట్టారు. దేవుడు నరరూపిగా, తనను తాను తగ్గించుకొని దీనుడుగా, రిక్తునిగా చేసుకున్నాడు. ఇది మార్పులేని నీ కొరకు, నా కొరకు ప్రభువు చేసిన కృపాకార్యము. (ఫిలిప్పి 2:5,6,7) పశువుల తొట్టెలాంటి మానవుని హృదయమును ఆయన నివాసముగా ఎంచుకున్నాడు. మన హృదయములో పరిశుద్ధాత్మకు ఆలయముగా మార్చుటకు ప్రభువు వచ్చాడు. సిలువలో మరణించి నీ కొరకు రక్తము కార్చి క్రయము చెల్లించాడు.

**ఆయనను పూజించి, ఆరాధించిన వారిలో కొందరి అనుభవాలు**

## గొర్రెల కాపరులు

మొదటిగా గొర్రెల కాపరులకు సంతోషకరమైన వార్త దేవుని దూతద్వారా తెలుపబడింది. వెంటనే వారు త్వరగా వెళ్ళి మరియను, యేసేపును, తొట్టిలో పండుకొనియున్న శిశువును చూచారు. తిరిగి వచ్చిన తరువాత కూడా వారు ఏమైతే విన్నారో, చూచారో వాటిని గూర్చి దేవుని మహిమపరచారు. స్తోత్రము చేసారు.

## భక్తిపరుడైన సుమెయోను

వాగ్ధానం చేయబడిన మెస్సీయాను చూడకుండా అతడు మరణము పొందడని సుమెయోనుకు దేవుడు చెప్పాడు. ఒకనాడు సుమెయోను ఆత్మవశుడై దేవాలయములోనికి వచ్చాడు. మనము కూడా అనుదిన కార్యక్రమాలలో ఆత్మచేత నడిపించబడుదుము గాక! శిశువును చేతులలోనికి తీసుకోగానే ఆ శిశువు ఎవరో సుమెయోనుకు అర్థమైంది. దేవుని స్తుతించుచూ "నాధా యిప్పుడు నీ దాసుని నీ మాట చొప్పున సమాధానముతో పోనిచ్చుచున్నావు. నీ దాసుని అన్యుజనులకు వెలుగుగాను నిన్ను బయలుపరచుటకు నీప్రజలైన ఇశ్రాయేలుకు మహిమగాను నీవు సకల ప్రజలయెదుట సిద్ధపరచిన నీరక్షణ నేను కన్నులారా చూచితిని" క్రీస్తును అంగీకరించిన క్రిస్మస్ దినము నీకు మధురక్షణం.

## అన్న ప్రవక్తి

విధవరాలైన అన్న దేవాలయమును విడువక ఉపవాస ప్రార్ధనలతో రేయిబగళ్ళు దేవుణ్ణి సేవిస్తూ వచ్చింది. విమోచకుని రాకడ గురించిన పాతనిబంధలోని దేవుని వాగ్దానాలను అమె విశ్వసించింది. ఆమె నిరీక్షణ ఫలించింది. ఆ విమోచకుడు ఒక శిశువుగా యెరూషలేము దేవాలయము లోనికి తేబడటాన్ని ఆమె కళ్ళారా చూసి ఆనందించింది. అన్న కూడా ఆ గడియలోనే లోపలికి వచ్చి దేవుని కొనియాడి యెరూషలేములో విమోచన కొరకు కనిపెట్టిచున్న వారందరితో ఆయనను గూర్చి మాటలాడింది. (లూకా 2:37,38) యేసుక్రీస్తు విమోచన సిలువ కార్యమును గూర్చి మాటటాడు తున్నామా? సువార్తను ప్రకటిస్తున్నామా? యిదియే సమయము.

నేడు నీ హృదయమాయనకు సమర్పించు క్రిస్మస్ శుభములు.

"The light of Christ Transforms the Stable of men's hearts into a temple for the Holyspirit"









# ఈ క్రిస్మస్ శుభవేళలో....

ప్రపంచ వ్యాప్తంగా క్రిస్మస్‌ను లోకం జరుపుకుంటారు. క్రిస్మస్ సందర్భంగా ఒకరికి ఒకరు కానుకలు ఇచ్చిపుచ్చుకుంటారు అంత మాత్రమే కాదు,మరో ప్రాముఖ్యమైన విషయమేమంటే ఎంత పేద క్రైస్తవులయినా ఇతరులకు ఏదో ఒకటి సాయం చేస్తూనే ఉంటారు. కనీస అవసరతలు తీరని అనేకమందికి అనేక విధాలుగా అంటే ఆహారం, మంచినీరు, వస్త్రాలు, వైద్యసాయం మొదలయిన విధానాలలో కోట్లాదిమంది క్రిస్మస్‌కు సాయం అందుకుంటారు.

స్పందన - సేవియర్స్ హార్టబీట్ సేవలో దేవుడిచ్చిన భారాన్ని బట్టి గత కొన్ని సం॥రాలుగా క్రిస్మస్. నూతన సంవత్సర సందర్భంగా లెప్రసీ కాలనీలు దర్శించి వారికి వస్త్రాలు, బియ్యం,నూనె,పప్పులు, ఓ సారి వారి కోరిక మేరకు పరుపులు (దోమలు కుట్టడం వలన వారికున్న ఆరోగ్య సమస్య ఎక్కువ కాకుంటుదని) ఇవ్వటానికి ప్రభువు కృప చూపారు.

అలాగే మన లిటిల్ ఏంజల్ హోమ్ లోని అనాథ, పేద పిల్లలకు మాత్రమే కాకుండా స్లమ్ ఏరియాల్లో ఉండే అనేక పిల్లలను సేకరించి వారికి కొత్త బట్టలు ఇవ్వగలుగుతున్నాము.

ఆయా ప్రాంతలలో దేవుని సేవ చేస్తున్న పాస్టర్లు, పాస్టరమ్మలకు నూతన వస్త్రాలు బహుకరించటానికి ప్రభువు కృప చూపుతున్నారు.

ప్రాముఖ్యంగా క్రిస్మసు రోజుల్లో రాత్రి సమయాల్లో వీధులలోనికి వెళ్ళి కనీసం కప్పుకోవటానికి దుప్పటి కూడా లేకుండా పేపర్లు, ప్లాస్టిక్ కాగితాలు,సిమెంటు బస్తాలే ఒక సంచిలా చేసుకుని దానిలో కాళ్ళు

కడుపులోకి ముడుచుకుని పడుకునే వారు అనేకులను గుర్తించి వారికి దుప్పట్లు, వేడి వేడి బిర్యానితో భోజనపు ప్యాకెట్లు ఇవ్వటానికి ప్రభువు కృప చూపుతున్నారు. ఈ సంవత్సరం దాదపుగా **2వేల దుప్పట్లు 2వేల భోజనం ప్యాకెట్లు** ఇవ్వాలనే ఆశతో,భారంతో ప్రార్థిస్తున్నాము దుప్పట్ల కోసం సూమారు**2 లక్ష రూపాయలు** భోజనం ప్యాకెట్ల కోసం ***1 లక్ష రూపాయలు*** ఖర్చవుతుందని అంచనా.

మా ప్రియ పాఠకులు, ఈ పరిచర్యలను ప్రేమించి ప్రతి ఒక్కరూ సహకరించాలని, ప్రతి ఒక్కరూ సహకరించాలని, ప్రత్యేకంగా మనవి చేస్తున్నాము.

ఈ సేవా కార్యక్రమాలన్నీ జరిగేటప్పుడు ప్రభువు నామం అత్యధికంగా మహిమ పరచబడాలని, ఘనపరచబడాలని ప్రార్థించాలని కోరుతున్నాము.

ఈ సేవలో సహకరించేవారిని, ఆ ప్రత్యేక దినాల్లో పని చేసేవారిని ప్రభువు నూరంతలుగా దీవించబడేలాగా ప్రార్థించాలని మనవి.











## ప్రత్యేక ప్రార్థనా మనవి

**విజయవాడ- గుణదలలో నిర్మాణంలో ఉన్న ప్రార్థనా మందిరము, అనాథ పిల్లలకు 'లిటిల్ ఎంజెల్స్ హోమ్'**

ప్రియ పాఠకులారా, ఈ నిర్మాణం కోసం పాఠకులు మాతో కలసి భారంతో ప్రార్థించాలని కోరుతున్నాము. ఈ క్రిస్మసు ప్రత్యేక సమయంలో దేవుని ప్రేరపణ ద్వారా ఓ ప్రత్యేక కానుక మీరు పంపాలని,ప్రార్థనా పూర్వకంగా మీరీ విషయన్ని తీర్మానించాలని కోరుతున్నాము. మరిన్ని వివారాలకోసం ఈ రోజే సంప్రదించగలరు.

**స్పందన**
ఇ.యస్.ఐ హస్పటల్ రోడ్, గుణదల,
విజయవాడ - 520 004 ఇండియా.



పాస్టర్. పి.సురేశ్‌బాబు

# అతిథి తెచ్చిన బహుమతి

ఎన్నో తరాల ఎదురుచూపు, ఎందరో ప్రవక్తల ప్రవచనాల నెరవేర్పు, కాల సంపూర్ణత, దేవుని ప్రణాళిక కలగలిసిన సమ్మేళనమే క్రీస్తు పుట్టుక. మనుష్యుల డాబు, డంబము లేని యదార్థ చరిత్ర సంఘటనలు, మలుపులు. పశువుల తొట్టిలో పండుకున్న క్రీస్తును చూడడానికి దేవుని ఆహ్వానాన్ని అందుకొని, పరవశంతో ప్రభువును చూచి, ప్రకటిస్తూ తిరిగి ప్రయాణమైన గొర్రెల కాపరులు. పరదేశం నుండి ప్రభువు పుట్టుకను కనుగొని, ప్రభవించిన తారను వెంబడిస్తూ, బేత్లెహేముకు బహుమతులతో చేరిన జ్ఞాన సమూహం. పరలోకదూతలు ప్రభువును స్తుతిస్తూ పాడిన పాట ఎంత వినసొంపుగా ఉండి ఉంటుందో!

## పరలోక పిలుపు

కొన్ని వందల లేఖనాలు ఒక్కసారిగా నెరవేరిన సమయం. అది నిజంగా పరలోక, ఇహలోక చరిత్రలో మరపురాని, మహాద్భుత ఘడియ. మనుష్యుల పిలుపులు లేవు, హడావిడి లేదు, అంతా దేవుని నిర్వహణ, పర్యవేక్షణ సాగింది. ఎవరిని ఎప్పుడు ఎలా ఎక్కడకు నడిపించాలో అంతా ఆయనే నడిపించాడు. మరియ, యేసేపు, గొర్రెల కాపరులు, జ్ఞానులకు దేవుని కబురు అందింది. సుమెయోనుకు, అన్నకు దేవుని కబురు అందింది. అందరికి పరలోక సంబంధమైన ఆహ్వానాలే అందాయి. క్రీస్తు పుట్టుకలో పరలోక పిలుపు చాలా ప్రాముఖ్యతను సంతరించుకుంది. వీరిలో ఎవ్వరూ మనుష్యుల సాయం పొందలేదు. ప్రతి ఒక్కరికి దేవుని ప్రత్యేక దర్శనం, ప్రత్యేక నడిపింపు. మనుష్యులను ఆశ్రయించినా జ్ఞానులకు ఫలితం దక్కలేదు. ఎన్నో గొప్ప విషయాలు చిన్నగా జరిగిపోయాయి. గొప్ప రక్షణ(బహుమతి) తెచ్చాడు. అది ఉచితమే!

## పశువుల తొట్టె

సత్రములో స్థలము లేదని యేసును పశువుల తొట్టిలో పరుండబెట్టారు. ఫోటోస్‌లలో గాని, పెయింటింగ్స్‌లలో గాని ఆ పశువుల తొట్టెను ఎంత అందంగా చిత్రికరీస్తారో. కాని నిజంగా పశువుల తొట్టి అసహ్యంగా ఉంటుంది. వాసన వస్తుంది. పరిసరప్రాంతాలలో బురదగాను, ఈగలు, దోమలతో నిండి ఉంటాయి. కొందరయితే పశువుల పాక దగ్గరకు వచ్చినప్పుడు గట్టిగా ముక్కు మూసుకుంటారు. యేసుక్రీస్తు స్థానములో నీవో నేనో ఈ లోకములో పుట్టినట్లయితే, వెంటనే వెనక్కు వెళ్ళిపోతామేమో? ఆయన మహిమను విడిచి ఆ పశువుల తొట్టిలోకి వచ్చాడు. అది



అనుకోకుండా ఆయన పట్ల జరిగింది కాదు. యేసుక్రీస్తు పుట్టుక, మరణ, పునరుత్థానాలలో ప్రతీది లేఖనాను సారమే, దేవుని చిత్తమే. అసలైన పాదు వాసన మన పాప జీవితంలో ఉంది. అది భరించడానికి, మనల నుండి దానిని తొలగించడానికే, దాని నుండి మనలను విడిపించడానికి ఆయన వచ్చాడు. మన మురుగు పాపాల ముందు ఆ పశువుల పాక మురుగు పెద్దదేమి కాదేమో! యేసుక్రీస్తుకు అడ్రస్ (ఆనవాలు) పశువుల తొట్టి అని దేవదూత గొర్రెలకాపరులతో చెబుతున్నాడు. యేసు "నేను పాపులను పిలవడానికే వచ్చాను. నీతిమంతులను పిలువ రాలేదు'' అంటున్నాడు. అనేకమంది ఈయనేమిటి పాపులతో భోజనం చేస్తున్నాడు. అసహ్యమైన వారితో ఉంటున్నాడు. అని అనుకుంటుంటే, అందుకే కదా నేను వచ్చాను అంటున్నాడు. ఆయన అసహ్యమైనది తొలగించేవాడు. నిన్ను ఆయన ఎంతో ప్రేమిస్తున్నాడు కాబట్టి మురికి కూపములో ఉన్న మనలను విడిపించడానికి ఆయన మహిమను విడిచి మురికిగా ఉన్న పశువుల శాలలోనికి సహితం వచ్చాడు.

## పరలోక అతిథి

మన యింటికి ఎవరైన ముఖ్యమైన అతిథి వస్తున్నారంటే ఇల్లంతా శుభ్రంగా ఉంచుతాము. అంటే ఎక్కడా మురికి లేకుండా చూసుకుంటాము. మరి మనకోసం వచ్చిన ఈ పరలోక అతిథి మురికిలోనికే వచ్చాడు. ఆయన మన కోసం వచ్చిన అతిథే గాని మనదగ్గర అతిథ్యం తీసుకోవడానికి వచ్చినవాడు కాదు. మనకు మంచి బహుమతి ఇవ్వడానికి, మనలను తన యింటికి తీసుకు వెళ్ళడానికి కావలిసిన అర్హత నివ్వడానికి వచ్చిన అతిథి. యేసు యింటికి వెళ్ళాలంటే మనకు అర్హత లేదు సరికదా! ఆయన మన యింటికి, మన లోకానికి రావాడానికి కూడా మనకు అర్హత లేదు. ఇప్పుడు ఆయన తనను తగ్గించుకొని మన దగ్గరకు వచ్చాడు, మనలను హెచ్చించి ఆయన ఇంటికి, పరలోకానికి తీసుకు వెళ్ళబోతున్నాడు. ఇది నిజంగా ఎంత అద్భుతమో కదా! ఆయన ఇచ్చే రక్షణ గొప్ప బహుమతి. ఆయన ఇచ్చే ఆ బహుమతి అందుకోవడానికి ఆయనను నీ హృదయంలోని ఆహ్వానించాలి. కేవలం ఆయన ఈ లోకానికి వచ్చినంత మాత్రన ఆయన తెచ్చిన బహుమతి నీకు దక్కదు. నీలోనికి ఆయన రావాలి, నిన్ను పరిశుద్ధపరచడానికి ఆయన కార్చిన రక్తం నీకు విమోచన కావాలి.

## పరలోక సంతోషం

పరలోకంలో నుండి వచ్చిన దేవదూతల సమూహం ప్రభువును చూచి పరవశంతో నిండిపోయారు. స్తుతి గీతం పాడారు. పశువుల తొట్టెలో ఉన్న యేసయ్యను చూచి గొర్రెల కాపరులు సంతోషించారు. పశువుల తొట్టెలో ఉన్నందుకు కాదు, రక్షకుడు పుట్టినందుకు. జ్ఞానులు యూదుల రాజు పశువుల తొట్టెలో ఉన్నాడేమిటి? అనే సందేహం లేకుండా రక్షణ అనే బహుమతిని తెచ్చిన యేసుకు బహుమతులిచ్చారు. వారిని నడిపించింది దేవుని దర్శనం, యేసు నక్షత్రం. దేవునిచేత నడిపించబడే ఓ విశ్వాసి ఆయనతో కలిసి సంతోషించు. ఆయన ఉన్న పరిస్థితులను బట్టి కాదు. ఆయనను బట్టి సంతోషించాలి. అయన ఇచ్చే అర్హత (రక్షణ) నిన్ను నన్ను ఆయన యింటికి చేరుస్తుంది. అది ఇవ్వడానికి గొప్ప ప్రణాళికతో వచ్చిన వాడే క్రీస్తు. క్రిస్మస్. హ్యాపీ క్రిస్మస్. ఆమేన్.


పుస్తక పరిచయం **ప్రవచనముల నెరవేర్పు**



దేవుని ఆత్మనడిపింపుతో శ్రీమతి లిల్లీ భాస్కర రావు గారి కలం నుండి జాలువారిన మరో ఆణిముత్యం, "ప్రవచనముల నెరవేర్పు". గతంలో 'వధింపబడిన దేవుని గొర్రెపిల్ల' 'సంఘములో స్త్రీలు మాట్లడ వచ్చునా?' అనే పుస్తకాలను రచించారు. ఇది మూడవది. ఈ పుస్తకంలో పాత నిబంధన ప్రవక్తల నుండి క్రొత్త నిబంధన ప్రవక్తల వరకు ప్రవచించిన ప్రవచనాలు - వాటి నెరవేర్పు యింకా నెరవేరవలసిన ప్రవచానాలు, అంత మాత్రమే కాకుండా కలలు-వాటి భావాలు, దర్శనములు-వాటి నెరవేర్పు ఎంతో వివరంగా రచించారు. ఈ గ్రంథం చదువుతున్నప్పడు సర్వజ్ఞుడైన దేవుని ఆంతర్యాన్ని సరైన రీతిలో అవగాహన చేసుకొని, విశ్వాస జీవితాన్ని మలచుకోడానికి ఎంతో ఉపయోగపడుతుంది. ఈ గ్రంథపఠన ద్వారా దేవుని రాకడకు మనల్ని మనం ఏ విధంగా సిద్ధపర్చుకోవాలో విశదమౌతుంది. విశ్వాసులకు, దైవ సేవకులకు, సత్యాన్వేషకులకు ఎంతో ఆశార్వాదకరమైన గ్రంథం. వెంటనే మీ కాపీని తెప్పించుకోండి కాపీలు పరిమితం. బుక్‌స్టాల్స్ వారికి ప్రత్యేక తగ్గింపు కలదు.

వివరాలకు, ఎం.ఒ పంపించుటకు మా చిరునామా :

శ్రీమతి ఎన్.లిల్లీ భాస్కర రావు
10-53-296, గ్రేస్ ల్యాండ్, ఎల్.ఐ.జి 23, నెహ్రూనగర్ కాలనీ,
విశాఖపట్నం - 530 002 ఫోన్: 0891-2566958, 9290998200

## యేసు బాలుని దరహాసం

కారు చీకటి కాంతి రేఖ –
కోటి వెలుగుల సూర్య రేఖ
నిశ్శబ్ద నిశీధి నిస్వన రేఖ –
నింపేది జగమంత ఆనంద రేఖ
అనంత ఆకాశ అరుణోదయ రేఖ –
అందరి వ్యధలు దీర్చ
విరిసింది పశుశాల –
యేసు బాలుని ప్రియదరహాస రేఖ
వరదూత గణం ప్రస్తుతించ –
గొల్లబోయలు సంభ్రమించ
జ్ఞాన త్రయం అన్వేషించ –
దయాప్రాప్త (మరియ) పరవశించ
పుణ్య యోసేపు పులకరించ –
వెలసింది బేత్లెహేము గుండె గుబాళింప
యేసు బాలుని పసి వాడని ప్రియ దరహాసరేఖ
యూదా జనం ఆకాంక్షించగ –
ప్రవచన నెరవేర్పు జరుగగ
అన్నా ప్రవక్త్రి ఆనందించగ –
యాజక సుమెయోను నిరీక్షణ ఫలించగ
రోమా రాజ్య పునాదులు వణకగ –
రక్షణ శృంగమై వెలయగ
కురిసింది భువికి విరితేనే జల్లుగ –
యేసు బాలుని దరహాసరేఖ
చూచితివా నీవా అనురాగ రక్షణ్య రేఖ? –
కక్ష కార్పణ్యాల వేడిలో వాడి వత్తలై
కఠిన మతోన్మాద అనలంలో శలభమై –
మాడి మసిబారిన మానవా ఈ నవోదయాన
సంపూర్ణ శాంతి సమాధాన ప్రదాయినియైన –
యేసు బాలుని సుందర దరహాసరేఖ
విరిసిందిగా నాకై –నీకై – నా – నీ రక్షణకై –
మురిసిపోదువుకో హృదయ ̆హన పాప ప్రక్షాళనకై
(దరహాసం – చిఱునవ్వు)

– శ్రీమతి.జి.నిర్మలా దేవదానం

## రాజాధి రాజు – కన్య మరియ సుతుడు

ఆకాశం చీకటి మయం..!
అది నడిజాము సమయం..!
అందరి గుండెల్లో..., గులాబీలు విరిసిన రాత్రి..!
అద్భుతమైన తార వెలసిన రాత్రి..!
అందరి జీవితాల్లో.. అమృతం కురిసిన రాత్రి..!

ఆకాశమంతా వింత కాంతులతో...,
వెలుగు మెరిసి విరజిమ్మిన విచిత్ర రాత్రి..!
యూదా దేశ బేత్లెహేము నందు..!
పసువుల తొట్టిలోన..!
ఉదయించె నేడు రాజాధి రాజు..!
ఉదయించినాడు కన్య మరియసుతుడు..!

కోమల హృదయ దినకరుడు..!
సర్వలోకంబు నేలు ఘనతేజుడు..!
విశ్వమంత ఏలు యెహోవా సుతుడు..!
పాపుల పాలిట ప్రాణ నాధుడు..!
నరుల కోసం జన్మ మెత్తిన కాంతి మంతుడు..!
సర్వ మహిమ సదయత యేసుడు..!

నరులయందున కరుణా దయాళుడు..!
సర్వ శక్తి గల సంపన్నుడు..!
సర్వ జనాంగ దయా స్వభావుడు..!
పరిశుద్ధాత్మ ప్రభు యేసుడు..!
ప్రాణ నాధ ప్రియతముడు..!
బాల యేసు జన్మదినంబు నేడు..!

శుభం.. శుభం.. క్రీస్తు జన్మదినం..!
ఇదే.. ఇదే.. నేటి క్రిస్మస్ పండుగ దినం..!

– శ్రీమతి.యం.నిర్మలా సుదీప్ రెడ్డి

**• నవంబర్ గ.ను.క జవాబులు •**

**అడ్డం ▪**

1.గెరిజీము 3.తూచరాదు 4.హిమము 5.మర్మము 6.లభించును 8.పాపుల 9.దెబ్బలు 10.మానని 14.నడవడి 15.లవొదికయ 17.ఈల 19.పదిమంది 20.మరణము

**నిలువు ▪**

1.గెత్సేమనే 2.జీవము 3.తూముల 4.హిస్సోపు 7.చుక్కాని 8.పాలుపడి 11.మేనల్లుడు 12.వలలను 13.ప్రాయశ్చిత్తము 16.దిగంబర 18.గది

## గురు శిష్యుల గుణబంధం



పా॥ దేవదానం గుండాబత్తిని

గుండాబత్తిని సామెతలు

శిష్యులను చేరదీసి - వారిని
పుత్రులుగా, మిత్రులుగా చూచేవాడు
సద్గురువు
శిష్యుల మనసులలో చెరగని ముద్రవేసి,
శిష్యుల గుండెల్లో చిరకాలం ఉండిపోయేవాడు
-నిత్యగురువు
పడిపోయేవాడిని నిలబెట్టి
నిలబడ్డవాడిన నడిపించి
నడిచేవాడిని దరిచేర్చేవాడు
సత్యగురువు
శిష్యులకు మాదిరిగా ఉండి
వారిని మాయమర్మము లేనివారిగా
తీర్చిదిద్దేవాడు
మహాగురువు
శిష్యులకు విద్యనేర్పి
వారిని తనకంటే గొప్పవారిగా
తయారు చేసేవాడు
పరమగురువు
శిష్యులకు - భక్తి విద్య - భుక్తి విద్య
రెండూ నేర్పించి
ముక్తి మార్గంలో నడిపించేవాడు
అమరగురువు
విశ్వమానవాళి పట్ల విశాల దృక్పథాన్ని కలిగించి -
సర్వమానవాళిపట్ల సోదర భావాన్ని కలిగించేవాడు -
జగద్గురువు

## క్రిస్మస్ వేడుక

అది చల్లని వెన్నెల రాత్రి
చక్కని పున్నమి శుభరాత్రి
బేత్లెహేమనబడిన దావీదు ఊరు
అందరు చిక్కని నిద్రలో జోగుతున్నారు
కన్నె మరియ ప్రసవవేదన పడుతున్నది
పండంటి కుమారుడని
పరిశుద్ధాత్మ వలన కన్నది
పొత్తిగుడ్డలతో చుట్టినది
పశువుల తొట్టిలో పరుండబెట్టినది
పట్టజాలని ఆనందము ఆమె ముఖములో
పరిశుద్ధ ప్రభువుకు తల్లియైనందుకు

ఆకాశములో వెలిసింది చక్కని చుక్క
జ్ఞానులకు దారిచూప ప్రత్యేక చుక్క
బంగారు, బోళము, సాంబ్రాణి విలువైన
కానుకలతో దర్శించారు జ్ఞానబృందం
సాగిలపడి పూజించారు బాలయేసుని

దేవదూతలు నేరుగా కాపరులను కలిసారు
పరలోక సైన్యమంతా స్తోత్రములు చేసారు
గొర్రెల కాపరులు త్వరగా వచ్చారు
గొర్రెలను కానుకలుగా తోలుకొని వచ్చారు
మరియను, యోసేపును, శిశువును దర్శించారు
విన్నవాటిని కన్నవాటిని చాటి చెప్పారు
విన్నవారందరు మిక్కిలి ఆశ్చర్యపడ్డారు.

ఆనాడు సత్రములో స్థలములేదు
పశువులతొట్టి కాదనలేదు
నీ హృదయములో నేడు యేసుకు స్థలముందా?
యేసయ్య కోసం వాంఛయుందా?

క్రిస్మసు మంచి వేడుక
ఇవ్వాలి ఎంతో మంచి కానుక

- రెవ.డి. షాలేమ్ కుమారి

# ఆంధ్రప్రదేశ్ బైబిల్ కాలేజి

( ఎ థియాలాజికల్ ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ అసెంబ్లీస్ ఆఫ్ గాడ్)
(ఎన్ అఫిలియేటెడ్ మెంబర్ ఆఫ్ ఆసియా థియాలాజికల్ అసోసియేషన్ - ఆటా)

## సమర్పణాపరులైన యవతీ యవకులకు సాటిలేని అవకాశం!

"వారు వినని వానిని ఎట్లు విశ్వసించుదురు? ప్రకటించువాడు లేకుండ వారెట్లు విందురు?" రోమా 10:14

**దేవుడు లోకాన్ని ఎంతో ప్రేమించి, జన్మ కర్మ పాపాలతో బంధితులైయున్న సమస్త మానవులకు తన కుమారుడైన యేసుక్రీస్తు మరణ పునరుత్థానాల ద్వారా రక్షణ మార్గాన్ని ఏర్పాటు చేశాడు. ఈ సువార్తను ప్రజలు విని, గ్రహించి, అంగీకరించాలంటే ఆ సువార్తను గురించి చెప్పేవాళ్ళు ఉండాలి గదా! ఇందుకోసం దేవుడు మనుష్యులనే ఉపయోగించుకోవడానికి ఎంచుకొని, సమర్పణాపరులైన స్త్రీ పురుషులను పిలుస్తున్నాడు. దైవసేవార్థమైన ఈ పిలుపును పొంది, దానిని నెరవేర్చడానికి యవనదశకంటే మించిన దశ ఏముంటుంది? తన తరపున నమ్మకంగా పనిచేసేవారిని దేవుడెన్నడూ నిరాశపర్చడు; వారికి ఏ మేలూ కొదవచేయడు. దైవసేవ చేయాలనే ఆశ, ఆయన పిలిచాడనే నిశ్చయత, ఆయన పనిపట్ల సమర్పణగల యవతీయవకులను తర్ఫీదు చేయాలనే దర్శనంతో, భారంతో ఆంధ్రప్రదేశ్ బైబిల్ కాలేజ్ 1989లో స్థాపించబడింది.**

ప్రత్యేకతలు :

- దాదాపు వందేళ్ళ వయస్సున్న అసెంబ్లీస్ ఆఫ్ గాడ్ సంస్కృతీ, సంప్రదాయం
- దశాబ్దాల సేవానుభవం, సామర్థ్యం, విద్యార్హతలున్న ఉపాధ్యాయ బృందం
- వేద విద్యాభ్యాసానికి సానుకూలమైన ప్రశాంత వాతావరణం, సదుపాయాలు గల సువిశాల ప్రాంగణం
- సుమారు ఆరువేల పుస్తకాలు, పత్రికలు గల చక్కని గ్రంథాలయం
- క్లాస్ రూం తర్ఫీదుతో పాటు తప్పని సరియైన పూర్తికాలపు ప్రాక్టికల్ పరిచర్యావకాశం
- భార్యా భర్తలకు, స్త్రీలకు ప్రత్యేక వసతి సౌకర్యాలు

| కోర్సుపేరు | మీడియం | కాలపరిమితి | విద్యార్హతలు |
|---|---|---|---|
| B.Th. | English | 3 Years | Intermediate/ PUC Pass |
| G.Th. | తెలుగు | 2+1 సం॥ | 10th క్లాస్ పాస్ |
| C.Th. | తెలుగు | 1 సం॥ | 10th ఫెయిల్, 10thలోపు |

**మారు మనస్సు అనుభవం కలిగి, సంఘానికి క్రమంగా హాజరౌతూ, దేవుని పిలుపు కలిగి 18 సం॥ల వయస్సు నిండిన ఎవరైనా చేరడానికి అర్హులే. ఆసక్తిగలవారు దరఖాస్తు కొరకు మీ చిరునామాతో పాటు రూ. 100/- ఈ క్రింది అడ్రస్‌కు మనియార్డర్ చేయండి.**

**ఎ.పి. బైబిల్ కాలేజి**
**మియాపూర్ (పోస్టు), హైదరాబాద్ - 500 049. ఫోన్ : 9701534091**
E-mail: apbc@rediffmail.com - Visit our website: www.apdsiag.org

# క్లుప్త ప్రసంగాలు

## క్రిస్మస్ సంతోషం

(లూకా 2, మత్తయి 2)

1. సంతోషాన్ని ప్రకటించిన దూతలు.
   లూకా 2: 8-14, యెషయా 53:3-6
2. సంతోషాన్ని పొందుకున్న గొర్రెల కాపరులు.
   లూకా 2:15-16, 20
3. సంతోషాన్ని ఇతరులకు పంచిన గొర్రెలకాపరులు, అన్న.
   లూకా 2:17,18, 36-38
4. సంతోషాన్ని భద్రపరచుకొన్న మరియ. లూకా 2:19
5. సంతోసాన్ని పరస్పరం పంచుకొన్న జ్ఞానులు.
   మత్తయి 2:1-12

## యేసు వచ్చాడు

(లూకా 2:1-13)

1. కాలము పరిపూర్ణమైనపుడు యేసు వచ్చాడు.
   లూకా 2:1-3
2. లేఖనాల నెరవేరునట్లుగా యేసు వచ్చాడు.
   లూకా 2:4-7
3. హీనదశలో ఉన్నవారి కొరకు యేసు వచ్చాడు.
   లూకా 2:8-9
4. స్తోత్రగీతము కొరకై యేసు వచ్చాడు.
   లూకా 2:10,12-13
5. రక్షణ నిచ్చుటకు యేసు వచ్చాడు. లూకా 2:11

## దేవుని పాత్రలు

1. దేవుడు **అధికారులను** వాడుకున్నాడు. లూకా 2:1-3
   కైసరు ఔగుస్తు జనసంఖ్య వ్రాయవలెనని ఆజ్ఞ ఇచ్చాడు.
2. దేవుడు **తన పరిశుద్ధులను** వాడుకున్నాడు. లూకా 2:4-5
   మరియ, యోసేపులు బాలుడైన యేసును సంరక్షించారు.
3. దేవుడు తన కుమారని వాడుకున్నాడు. లూకా 2:7
   యేసు రక్షకుడుగా భువికి అరుదెంచాడు.
4. దేవుడు **తన దూతలను** వాడుకున్నాడు. లూకా 2:8-14
   దూతలు దేవుని కుమారుని పుట్టుకను ప్రచురించి స్తోత్రముచేసారు.
5. దేవుడు **గొర్రెల కాపరులను** వాడుకున్నాడు. లూకా 2:15-20
   గొర్రెల కాపరులు శిశువును చూచి తాము విన్నవాటిని, కన్నవాటిని ప్రచురం చేసారు.

## కాపరుల కథ

(లూకా 2:8-20)

1. మందపై ఉన్న కాపరుల దృష్టి. లూకా 2:8
   పనిపై శ్రద్ధ కలిగిఉన్నారు
2. దేవదూతల మాటలు విశ్వసించారు. లూకా 2:9-14
   వినుట వలన విశ్వాసం కలుగును
3. బేత్లెహేముకు పయనమయ్యారు. లూకా 2:15-16
   విశ్వాసం వారిని యేసుదగ్గరకు నడిపించింది
4. క్రీస్తుకు సాక్షులయ్యారు. లూకా 2:17-18
   వారి విశ్వాసాన్ని చాటుతున్నారు
5. దేవునికి స్తుతి చెల్లించారు. లూకా 2:20
   దేవుని క్రియలను తలపోస్తూ స్తుతించారు.



# వివాహవేదిక

## వధువు కోసం..

24 సం॥రాల వయసు 5.9 ఎత్తు, బి. టెక్ చదివి సింగపూర్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తోన్న ఆర్యవైశ్య కుటుంబం నుండి రక్షణానుభవం గల యువకునికి 21 సం॥ వయసు, 5.5 ఎత్తు గలిగి యం. సి. ఏ గాని బి. టెక్ గాని చేసిన యువతి కావలెను. రెఫరెన్సు నంబరు. S.V.V F 594 సంప్రదించవలసిన ఫోన్ నంబరు. 944 124 8002, 08814-257743

30 సం॥రాలు 5.11 ఎత్తు, మంచి రంగు, స్లిమ్, B.Tech, MS, Ph.D (USA) చేసి హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటిలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా జాబ్, బిసి. సి (మాల), మారుమనసు అనుభవం గల యువకునికి మంచి రంగు,స్లిమ్, 5.5 ఎత్తు గాని ఎక్కువగాని ఉండి డాక్టరు గాని ఇంజనీరు గాని ఏదైనా PG చేసి రక్షింపబడిన యువతి కావలెను Ref. No. S.V.V F 595 , Ph. 9885104480, 040-27904247

30 సం॥రాల వయసు 5.11 ఎత్తు, ఛామన ఛాయ, ఐటి ఐ చదివి మున్సిపాలిటీలో సివిల్ కాంట్రాక్టరుగా జాబ్ చేస్తోన్న BC.C, బాప్టిస్ట్ సంఘానికి చెందిన యువకునికి తగిన వధువు కావలెను. Ref. No. S.V.V F 596 Ph. 9989873568

29 సం॥రాల వయసు, 5.5 ఎత్తు B.Sc చదివి సేవకు సమర్పించుకుని (ప్రస్తుతం ఆచార్య ఆరార్కే గారి వద్ద) సేవలో ఉన్న బాప్టిస్ట్ సంఘానికి చెందిన యువకునికి 25 సం॥రాల వయసు కలిగి 5.2 ఎత్తు, ఏదైనా డిగ్రీ గాని, బియిడి గాని చేసి సేవ చేయాలనే ఆశ గల యువతి కావలెను. Ref. No. S.V.V F 597 Ph. 9949227892

26సం॥రాల వయసు 5.5 ఎత్తు, వీడియో మిక్సింగ్ ఎడిటర్ గా జాబ్ చేస్తూ యాదవుల కుటుంబాన్నుండి ప్రభువును నమ్ముకున్న యువకునికి 25 సం॥ లోపు 5.2 ఎత్తు గలిగి యాదవులలో ప్రభువును నమ్ముకున్నయువతి కావలెను. Ref. No. S.V.V F 598 Ph. 9550477950

## వరుని కోసం..

23 సం॥రాల వయసు 5.3 ఎత్తు, బి. ఎ చదివి సేవలో ఉంటున్న యువతికి 25 సం॥రాల వయసు, 5.3 ఎత్తు కలిగి సేవలో ఉన్న యువకుడు కావలెను. No. S.V.V F 599 Ph. 9550477950

విశ్వాసుల కుటుంబాలలో అనేకమంది తల్లిదండ్రులు ప్రత్యేకించి అన్యకుటుంబాలనుండి రక్షింపబడిన వారు తమ పిల్లల వివాహాల నిమిత్తం ఎంతో భారంగా ప్రార్థిస్తున్నారు. కొందరు కృంగిపోతున్నారు. వారికి ఆదరణగా, సహాయకారిగా ఉండటానికి యువతీయువకులు వివరాలు స్పందన సేవకు పంపండి. ఈ యౌవనస్తుల కోసం ప్రత్యేకంగా ప్రార్థన చేస్తాము. జీవితంలో అతి ప్రాముఖ్యమైన వివాహ నిర్ణయాన్ని దేవుని చిత్తానుసారంగా తీసుకునేట్లు ఈ యవ్వన బిడ్డల కోసం ప్రార్థన చేద్దాము.

(4వ పేజి తరువాయి)

**సుమయోను**

'నీతిమంతుడు,భక్తిపరుడు' –నీతితో,దేవునియందు భక్తులతో జీవించినవాడు.

**అన్న ప్రవక్తి**

'దేవాలయమును విడువక ఉపవాస ప్రార్ధనలతో రేయింబగళ్ళు సేవ చేయుచుండెను.'–మెళుకువ కలిగి,భక్తితో జీవించినది.

**అరిమతయి యోసేపు**

'సజ్జనుడు, నీతిమంతుడు' – మెళుకవతో,నీతితో జీవించినవాడు.

వీరు ముగ్గురు తీతు2:13 లో చెప్పబడినట్లు 'శుభ్రప్రదమైన నిరీక్షణ కోసం' లేదా మరో అర్థమున్నట్లు 'ఇశ్రాయేలు యెక్క నిరీక్షణ' కోసం కనిపెట్టారు, ఎదురు చూచారు.

ప్రభువువారి రెండో రాకడ బైబిలు గ్రంథంలో ఎన్నో సార్లు ప్రస్తావించబడింది. ఈ రోజున మనముందున్న గురతర బాధ్యత, అనేకులను అందు కోసం సిద్ధం చేయాల్సిన అగత్యం మనకు ఎంతైనా ఉందని మరువకూడదు.

ఆచార్య ఆరార్కే గారు తన గీతాల్లో ప్రశ్నించినట్టు, ఈ క్రిస్మను శుభవేళలో ఈ ప్రశ్న మనమూ వేసుకుందామా? **'యేసే వస్తే ఈ నిమిషంలో** మన పరిస్థితి ఏమిటి?'

దైవాశీస్సులు వందనములతో మీ సంపాదకుడు

**దేవసహాయం దండల**





## శ్రీమతి గ్రేసి విజయ గారి మరో అద్భుత రచన

## "భూదిగంత యేసు సాక్షులు"

"భూదిగంత యేసు సాక్షులు' అనే ఈ శ్రేష్ఠమైన ఆధ్యాత్మిక గ్రంథం శ్రీమతి గ్రేస్ విజయగారి మరో అద్భుత రచన, సేకరణ. క్రీస్తునందు ప్రియులు శ్రీ సుందరరావు గారు, శ్రీమతి గ్రేస్ విజయగారు తమ తమ ఉద్యోగాల్లో రిటైరయినా, అమెరికాలో నివాసముంటున్నా దేవుని సేవ చేయలనే వారికున్న ప్రగాఢమైన వాంఛ, తపన ఎంతో హర్షించదగింది. వారి రచనలన్నీ యేసు ప్రభువు మహిమను చాటేవి అంటే అతిశయోక్తి కాదు. సోదరి గ్రేస్ విజయగారి 11వ పుస్తకమిది. ఈ గ్రంథాన్ని ప్రచురించటం కూడా ఒక అద్భుతమే! అమెరికాలో నివసించే వారి పెద్ద కుమారుడు డేవిడ్ రవి అనుకోని పరిస్థితుల్లో ఈ లోకయాత్ర ముగించి ప్రభువు సన్నిధికి వెళ్లిపోయారు. పుట్టెడు దుఃఖంలో ఉండి కూడా ఈ గ్రంథాన్ని ప్రచురించటం, అదీ తమ ప్రియకుమారుని జ్ఞాపకార్థం అంకితమివ్వటం ఎంతో ముదావహం! మా పాఠకులు ప్రతి ఒక్కరూ ఈ గ్రంథాన్ని తెప్పించుకుని చదవాలని, అనేకుల రక్షణ కోసం ఈ పుస్తకాలను వారికి బహుమతిగా పంచి ఇవ్వాలని కోరుతున్నాము.

**విరాళం 50/- (పోస్టేజి 20/- అదనం)**




## యస్.సుందరరావు గారి మరో అద్భుత రచన

## "Offsprings from the TABERNACLE"

"Offsprings from the Tabernacle" అనే ఈ పుస్తకం టి.యస్.సుందరరావు గారు రచించిన మూడవ అద్భుత రచన. ఇందులో దేవుని పట్ల ఇశ్రాయేలీయుల నమ్మకత్వాన్ని గురించి, దేవుడు గొప్ప శ్రమలు, బాధలలో ఉన్న వారి కొరకు ఎలా వచ్చాడో వివరించబడింది. సుందరరావు గారు రచించిన మొదటి రెండు పుస్తకాలు "The Legacy of God's People" "Quest for the Living God" భారతదేశంలోను, అమెరికాలోను ఎంతో ఉపయోగకరమైన పుస్తకాలుగా ప్రజాదరణ పొందానాయి.

**విరాళం 75/- (పోస్టేజి 20/- అదనం)**

ఇప్పడే మీ కాపీ కొరకు మాకు వ్రాయండి.

**స్పందన,** ఇ.యస.ఐ హాస్పటల్ రోడ్, గుణదల, విజయవాడ – 520004



రెవ. బి. యస్. ప్రకాశ్

# ఆయన నక్షత్రము

ప్రియమైన పాఠకులారా మీకు క్రిస్మస్ మరియు నూతన సంవత్సర శుభాకాంక్షలు

తూర్పుదేశము నుండి వచ్చిన జ్ఞానులు హేరోదు మహారాజునొద్దకు వచ్చి "యూదుల రాజుగా పుట్టిన వాడెక్కడున్నాడు? తూర్పుదిక్కున మేము ఆయన నక్షత్రము చూసి ఆయనను పూజింపవచ్చితిమని" చెప్పారు. మత్తయి 2:2

ఆకాశములో కోటాను కోట్లుగా నక్షత్రములు నక్షత్ర మండలాలు ఆది దేవుడు సృష్టించాడు. ఇవి అన్నియు ఆదికాండములో 1వ అధ్యాయము నుండి మనము చూడగలము.

ప్రియమైన వారలారా ఎన్నెన్ని నక్షత్రములు ఆకాశములో ఉన్నప్పటికీ ఆయన నక్షత్రములోఒక ప్రత్యేకమైనది. ఆయన నక్షత్రము పరిమాణము అంతుపట్టలేనిది. నేటి వరకు ఖగోళ శాస్త్రజ్ఞులు గాని, సైన్స్ విభాగము కలవారు గాని కనుగొనలేని అంతుపట్టుజాల నిధి. "ఆయన నక్షత్రము"

క్రిస్మస్ పండుగ సందర్భమున క్రీస్తును కలిగినవారు క్రీస్తును కలుగలేనివారు కూడ ఫ్యాషన్‌గా దుకాణాల వద్ద, కేకులుఅమ్మే బేకరివారు బట్టల షాపువారు, వివిద రకముల షాపులవారు ఏదో ఒక ఆచారముగా వాడుకగల పేపరుతో తయారు చేసిన (స్టార్) నక్షత్రము అందరకి కనబడులాగున ఎలక్ట్రిక్ బల్బుతో కాంతివంతగా వెలిగించి కనబరుచుతారు. ఇది కొంత మందిని ఆకర్షించవచ్చు లేక వ్యాపార ప్రకటన కావచ్చు గాని "నక్షత్రము" క్రిస్మస్ సూచనగా ఏమీ తెలియపరుచుచున్నాదన్నది ఒక ప్రశ్న.

నక్షత్రము సూచనగా క్రీస్తు జన్మించాడు అని ఆయన జన్మము పాపుల కోరకే అని తెలియపర్చుచున్నది?

"ఆమె ఒక కుమారుని కనును తన ప్రజలను వారి పాపములు నుంచి ఆయనే రక్షించును. గనుక ఆయనకు యేసు అను పేరు పెట్టుదురు".

మీరు కట్టిన నక్షత్రము దేనిని పోలి యున్నది. ఆచారముగా లేక వాడకగా అందరికి కనబడాలని లేక మేము కుడా క్రైస్తవులుమని తెలియపర్చడానికా? సూచనగా ప్రతీ ఆదివారం మందిరమునకు వెళ్ళుటగాని గృహవేడుకలు జరుపుకొనుట గాని లేక సంఘకాపరి వచ్చి వెళ్ళినపుడు గాని ఎవరికీ తెలియదు గాని డిసెంబరు 25న స్టార్ కట్టినపుడు మాత్రమే వారు క్రైస్తవులు అని తెలుస్తుంది.

స్టార్ కట్టిన మాత్రమున అందరూ క్రైస్తవులు అనబడరు గాని వారిలో కొందరిని స్టార్ క్రైస్తవులు అని అంటారు. ఎందుకంటే వారు ఎప్పుడు కుడా క్రీస్తు మాదిరి అడుగుజాడలలో నడిచినట్లు ఎక్కడ కనబడరు. మీరు కట్టిన స్టార్ దేనిని పోలి యున్నది. ఎంతమందికి "ఆయన నక్షత్రము" గురించి తెలియచెయబడియున్నది. మీరు కట్టిన



స్టార్ ఎంతమందికి మీ గృహము లేక మీరు సమాజములో సాక్షిగా నిలుస్తున్నారు.

కొంతమంది సంవత్సరమంతా అన్యులుగా జీవించి డిసంబరు 25వ తేది వచ్చేసరికి స్టార్ తగిలించి క్రీస్తు జన్మించాడు అనే సూచనగా తెలియపరుస్తారు. మన సాక్ష్యము ఎంత వరకు పని చేస్తుంది. మదిలో లేని క్రీస్తు జననము బయట ప్రపంచానికి ఎలాగు తెలియ పర్చగలము

కాబట్టి అన్యుజనులు నడుచుకొనునట్లు మీరిక మీదట నడుచుకొనవలదని ప్రభువు వారు సాక్షమిచ్చుచున్నారు. ఎఫెసి :4:17.

రక్షణ లేని లక్షలాది ప్రజలలో "ఆయన నక్షత్రము" గురించి వివరించి అట్టి జనము మధ్యన మీరు జీవ వాక్యమును చేతపట్టుకుని లోకమందు జ్యోతులవలే కనబడుచున్నారు. ఫిలిప్పీ :2:16 "ఆయన నక్షత్రము" లోకానికి ఏమి తెలియజేస్తుందో అలోచించి మీరు అట్టి మాదిరిగా ఉండాలని పై వాక్యము భోధిస్తుంది.

బుద్దిమంతులైతే ఆకాశమండలము లోని జ్యోతులను పోలినవారై ప్రకాశించెదరు. నీతి మార్గము ననుసరించి నడుచుకొనునట్లు ఎవరు అనేకులను త్రిప్పుదురో వారు నక్షత్రము("ఆయన నక్షత్రము") వలే నిరంతరము ప్రకాశించెదరు.

ఇప్పుడు మీరు ఎవరి నక్షత్రమువలే పోలియున్నారు? "ఆయన నక్షత్రము" వలె పోలి ఉంటే దీవించబడుదురు, ప్రకాశించెదరు.

పాపులను రక్షించుటకు క్రీస్తుయేసు లోకమునకు వచ్చెనను వాక్యము నమ్మదగి నదియు పూర్ణ అంగీకారమునకు యోగ్యమై నదియునై యున్నది. 1 తిమో 1:15.

## నవంబర్ గ.ను.క ఆల్ కరెక్టు వ్రాసినవారి పేర్లు

డి.ప్రసాద్-రైల్వేకోడూరు, బి.శాంతకుమారి-కడప, సి.సుశీలమ్మ-కర్నూలు, యమ్.లీలమ్మ-జమ్మలమడుగు, యన్.సత్యనారయణ-విశాఖపట్నం, వి.కె.విజయసుధ-గిద్దలూరు, బి.ఎలీషారావు-గుడివాడ, ఎస్.సుందరియేసురత్నం-కొట్టూరు, ఎస్.దేవమణి-ఎమ్మిగనూరు, కె.ప్రేమరూతు-గుంటూరు, పి.జెర్మియా-పెదపులిపాక, వి.జడ్సన్-అమీనాపురం, యం.సంపతీపీటర్-పరకాల, ఆర్.జయమ్మలాబాను-గుంతకల్, వి.ఫ్లోరెన్స్‌చార్లెస్-కరీంనగర్, టి.దేవకుమారి-చెవుటూరు, జి.నిర్మలాదేవదానం-నిడుబ్రోలు, యం.రత్నకుమారి-అమ్మిరెడ్డిగూడెం, బి.మణిజయప్రకాష్-అమ్మిరెడ్డిగూడెం, పి.హెచ్.మార్గరేట్-నెల్లూరు, యం.ఝాన్సీశాంతకుమార్-హన్మకొండ, జి.పి.దాస్-హైదరాబాద్, జి.పద్మరాజు-కాకినాడ, బి.సుగుణమ్మ-కావలి, అమృతజోన్స్-చీరాల, కె.విమల-హైదరబాద్, పి.ఆశీర్వాదమ్మ-పూసపాటిరేగ, టి.శోభారాణి-హన్మకొండ, ఎస్.కమల-ఒంగోలు, బి.కె.శ్యామలాదేవి-కర్నూలు, వి.భాగ్యలక్ష్మి-విశాకపట్నం, జి.కే.యల్.సుగుణమ్మ-బద్వేల్, జి.గ్రేసమ్మ-నంద్యాల, బి.కృపానందం-నర్సాపుర్, యన్.శాంతిశ్రీ-నిమ్మకూరు, టి.దీనమ్మ-హన్మకొండ, కె.జె.మార్గరేట్‌పద్మాకర్-గుత్తి, సుశీలమనోహర్‌రాజ్-నంద్యాల, మెర్సీలారెన్స్-కాకినాడ, యమ్.మణిలతప్రభాకర్-కర్నూలు, బి.అనీమేరీ-హైదరాబాద్, దేవకరుణదేవిడ్-అనంతపురం, టి.శాంతరత్నం-ఏలూరు, సి.హెచ్.కస్తూరిభాయి-చీరాల, కె.విజయ-తెనాలి, యన్.బి.ప్రభావతి-బేస్తవారిపేట, కె.కనకమ్మ-హన్మకొండ, జె.స్వామినాధన్-కుప్పం, యన్.యస్.చంద్రావతి-మోదుకూరు, వై.మాణిక్యం-కంచికచర్ల, వై.ఎస్తేరమ్మ-కంచికచర్ల, కె.శెశీల్య-కంచికచర్ల, యస్.జమీమామాథ్యూస్-ఒంగోలు, బి.కెంపురత్నకుమారి-వరంగల్, ఆలూరినవమ్మ-పొదిలి, కె.సుశీలవెంకటరత్నం-హన్మకొండ, జె.సుందరయ్య-చిత్తూరు, జె.ప్రసాద్‌రావు-రంపయర్రపాలెం, ఎ.ముదిరాజ్-కడప, యన్.సరళమ్మ-గిద్దలూరు, మార్తాయేసుదాస్-జమ్మలమడుగు, కె.భారతీదేవప్రియం-కడప, ఫెయిత్‌రాజమణి-మైలవరం, జె.సరోజిని-రాజమండ్రి, ఎ.కె.జయమ్మ-అనంతపురం, పి.రతుఆమోస్-కనిగిరి, ఐ.దేవిడ్‌రాజు-గోకవరం, యస్.సువేదమ్మ-ఎమ్మిగనూరు, జి.పాల్-కలసపాడు, డి.సామ్యుల్-సూరత్‌కల్, ఆర్.శశికుమార్-మోదుకూరు, వై.మేరీప్రమీల-హిందూపూర్, కె.కృపానందం-చెన్నై, పి.నయోమి-బెంగుళూరు, ఐ.రత్నమయ్య-నంద్యాల, వై.మరియమ్మ-చెన్నై, వై.నిరీక్షణకుమార్-ఇనమనమెళ్ళూరు, పి.ధనమ్మ-మదనపల్లి, డి.ఐజయ్య-జమ్మలమడుగు, జి.భారతిఅంద్రూస్-చింతకుంట, డి.సుందర్‌రాజన్-కుప్పం, సి.సులోచనమ్మ-జమ్మలమడుగు

**ఒక తప్పుతో వ్రాసినవారు:** జె.జి.సుందరమ్-గొట్టిప్రోలు, యం.నిర్మలసుదీప్‌రెడ్డి-కొండపల్లి, జి.స్వర్ణలతసుందర్-కడప, యల్.కృపమ్మ-బద్వేలు, టి.సువర్ణరాజరత్నం-కడప, యమ్.రోజమ్మ-కడప, యన్.అరుణకుమారి-గిద్దలూరు, జి.విమలమ్మమేరి-కొమరవోలు, ప్రభావతి-చిత్తూరు, బి.సరోజిని-గుంతకల్, జేన్‌ఆనంద్-కర్నూలు,



ఆచార్య ఆరార్కే

# ప్రకటన గ్రంథ పరమ సత్యాలు

**యోహాను** ఆసియాలో ఉన్న ఏడు సంఘాలకు శుభమని చెప్పి వ్రాయునది. వర్తమాన, భూత, భవిష్యత్తు కాలములలో ఉన్నవానినుండి, ఆయన సింహాసనం ఎదుట ఉన్న ఏడు ఆత్మలనుండి, కృప, సమాధానములు మీకు కలుగును గాక! ఆసియాలో ఉన్న ఏడు సంఘాలకు అభినందనలు. యోహాను ఈ అభినందనలు స్వయంగా పంపుతున్నాడు. యేసుప్రభువు నుండి అతనికి సమాచారం అందింది. అది చిన్న ఆసియా ప్రస్తుతం దాన్ని టర్కి ప్రాంతమంటారు. ఈ ఏడు సంఘాలకు యోహాను చిరపరిచితుడే. యోహాను ఎఫెసీ సంఘకాపరి. ఆ ప్రాంతాలలో యోహాను పర్యవేక్షకుడు. యేడు సంఘాల, యేడు ఆత్మల దేవుని వాక్యంలో ఏడు అంకెకు ఎంతో ప్రాముఖ్యత ఉన్నది. యేడు అనే అంకె పరిపూర్ణత కాదుగాని ముగింపును సూచిస్తుంది. పరిపూర్ణతకు, ముగింపుకు తేడా ఉంది. యేడు అంటే ముగింపు. ఇశ్రాయేలుతో దేవుని నిబంధన, సబ్బాతు, సున్నతి, ఆరాధన, ఇవన్నీ యేడో రోజుతో ముడిపెట్టబడినవి. యెరికో పట్టణము చుట్టూ బూరలు ఊదుతూ యాజకులు యేడుసార్లు ప్రదక్షణం చేశారు. నయమాను యేడు సార్లు యోర్దాను నదిలో మునగాల్సివచ్చింది. ఈజిప్టులో యోసేపు ఉండగా యేడుసంవత్సరాల సమృద్ధి, యేడు సంవత్సరాల కరువు, నెబుకద్నెజరు యేడు సంవత్సలు ఉన్మాదిగా తిరగటం, ఇవన్నీ మనము చూచాము. ప్రభువు నేర్పిన మాదిరి ప్రార్ధనలో యేడు అంశాలున్నాయి. మత్తయి 13 వ అధ్యాయంలో యేసుప్రభువు యేడు ఉపమానాలు బోధించాడు. యేడు రొట్టెలు ప్రభువు జనసమూహానికి వడ్డించాడు. సిలువనుండి యేసు యేడు మాటలు పలికాడు. ప్రకటన గ్రంధంలో యేడు అనే అంకె పదే పదే మనకు తటస్థపడుతుంది. ఈ గ్రంధానికి యేడు అంకే కీలకం. యేడు సంఘాలు అంటున్నాడు. యేదేనా? ఇంకా సంఘాలు లేవా? ఆసియాలో ఇంకా సంఘాలున్నాయి. కొలస్సీ, మిలేతు, హీరాపోలి, త్రోయ మొదలైన చోట్ల సంఘాలు లేకేం ఉన్నాయి. హీరాపోలి లవొదెకియకు పదహారు కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇప్పుడదంతా శిధిలంలో ఉంది. యోహాను యేడు సంఘాలకు ఉత్తరాలు వ్రాస్తున్నాడు. అయితే యోహాను యేడు సంఘాలకు వ్రాసిన ఉత్తరాలలో సంఘములన్నిటి సంపూర్ణ చరిత్ర సూచకప్రాయంగా మనకు చూపబడింది. సంఘముల సమగ్ర చిత్రణ


సింహాసనాసీనుడైన మహిమగల ప్రభువు

ఈ యేడు ఉత్తరాలలో చక్కగా చూపబడింది. చిన్న ఆసియా ప్రాంతమంటే లూదియ, మైసియ, కెరియ, ఫ్రుగియలో కొన్ని భాగాలు కలిసి అసియా మైనరు లేదా చిన్న ఆసియా ప్రాంతమని వ్యవహరిస్తారు. ఆసియా అంటే మొత్తం ఆసియా ఖండం అనుకోకండి. నాలుగో శతాబ్దం వరకు చిన్న ఆసియా అనే పేరే లేదు. సరే యోహాను ఈ యేడు సంఘములకు శుభములు చెప్తూ అంటున్నాడు "కృపాసమాధానములు మీకు కలుగును గాక! గ్రీకు భాషలో "కేరిస్" అంటే కృప, షాలోమ్ అనే హెబ్రీ మాటకు సమాధానం అని అర్ధం. కృపలో నుండి సమాధానం ప్రవహిస్తుంది, ప్రసరిస్తుంది. మన ఆశీర్వాదలన్నిటికి ఈ రోజు మూలస్థానం కృపే. ప్రకటన గ్రంధమంతట మనకు దేవుని కృప, దేవుని సమాధానము సాక్ష్యత్కరిస్తాయి. ప్రకటన గ్రంధం వినటానికి భయమెందుకు? మన హృదయాల లోనికి దేవుని శాంతి జాలువారి ప్రవహిస్తుంది. యేసుక్రీస్తు నుండి ఈ కృపాసమాధానాలు మనలోకి పారతాయి. తండ్రినుండి, యేసుక్రీస్తు నుండి, యేడు ఆత్మలనుండి మనకు శాంతి. ఇక్కడ దేవుని త్రిత్వం మనకు కనబడుతుంది చూడండి. వర్తమాన, భూత, భవిష్యత్తు కాలములలో ఉన్నవాడు అంటే దేవుడు, తండ్రి, నమ్మకమైన సాక్షి, పునరుత్తానుడు, భూపతులకు అధిపతియైన యేసు. యేసు మనలను ఎంతో ప్రేమించాడు, తన రక్తము వలను మనకు పాపవిముక్తి ప్రసాదించాడు.

ఈ రెండు వచనాలలో యేసుక్రీస్తుకు చెందిన బిరుదాలు సరిగ్గా ఏడున్నాయి. ఒకటి యేసు నమ్మకమైన సాక్షి, ఆయనకు ఆయనే సాక్షి. ఈ గ్రంధమంతట యేసుక్రీస్తు సాక్ష్యమే. ఆయనే నమ్మకమైన సత్య సాక్షి. రెండు మృతులలోనుండి ఆది సంభూతుడుగా లేచినవాడు. "ప్రొటోటాకోస్" అంటే తిరిగి జన్మించిన మొదటివాడు. అనగా చనిపోయి లేచిన వారిలో మొదటి వాడు, ఆది సంభూతుడు. తిరిగి లేచినవాడు. మళ్ళీ చనిపోడు. మరణగర్భంనుండి ఆదిసంభూతుడు. పుట్టిన మొదటివాడు, మృతినుండి లేచినవాడు. పునరుత్థానుడు, సమాధి గర్భంలోనుండి వచ్చినవాడు. మహిమ శరీరంతో తిరిగి లేచినవాడు. అంతకుముందు ఆయనలాగా మృతులలోనుండి లేచినవారు లేరు. ఆయన తరువాత ఆయనను బట్టి అనేకులు తిరిగి లేచినవారయ్యారు. ఆయనే ఆదిసంభూతుడు. తరువాత సంఘం ఎత్తబడుతుంది. 1 థెస్స 4:14 'ఆ తరువాత ఆయన వచ్చి రాజ్యం స్థాపిస్తాడు.' మూడు ఆయన భూపతులకు అధిపతి ఆయన వెయ్యేండ్లు పరిపాలన చేస్తాడు. ఫిలిప్పీ 2:9-11 వరకు యేసుక్రీస్తు ప్రభువని లోకమంతా ఒప్పుకుంటుంది. ప్రతివాని మోకాలు యేసునామమున వంగుతుంది. నాలుగు మనలును ప్రేమిస్తున్నవాడు, ప్రేమించేవాడు, ప్రేమికుడు, ప్రియుడు. ఆయన మనలను ప్రేమిస్తున్నాడు అని ప్రకటన గ్రంధం ప్రకటిస్తుంది. ఈ క్షణం యేసు నిన్ను ప్రేమిస్తున్నాడు. ఐదు తన రక్తము వలన మన పాపములనుండి మనలను విమోచించినవాడు, విడిపించినవాడు. లేవి 15:11 రక్తమంటే ప్రాణం తన రక్తంతో మనకు ప్రాయశ్చిత్తం చేశాడు. యేసురక్తమే జయం. 1పేతు 1:18,19 "వెండి బంగారముల వంటి క్షయ వస్తువుల చేత మీరు విమోచింప బడలేదు గాని అమూల్యమైన రక్తము చేత అనగా నిర్దోషము, నిష్కల్మషము అయిన గొర్రెపిల్లవంటి క్రీస్తు రక్తము చేత విమోచింపబడ్డారు. దేవుడొక్కడే, దేవునికి మనకు మధ్యవర్తి ఒక్కడే, అయనే యేసుక్రీస్తు అనే నరుడు. ఆరు ఆయన మనలను తన తండ్రియైన దేవునికి ఒక రాజ్యముగా, యాజకులుగా చేసాడు. విశ్వాసులు రాజులని చెప్పబడలేదు గాని వారు యాజకరాజ్యం. యేసుతో కూడ పరిపాలిస్తారు. ఆయన మొదట మధ్యాకాశానికి వస్తాడు. అప్పుడు సంఘం ఎత్తబడుతుంది. ఆయనకు సంఘం పెండ్లికుమార్తె. ఆయన నీకు నాకు ప్రభువు. మనలను యాజకరాజ్యంగా చేసాడు. యేసు తండ్రియైన దేవుడు యేసును బట్టి మన తండ్రి మన దేవుడు అవుతున్నాడు. ఇక యేడో బిరుదం ఆయనకే మహిమ ప్రభావములు యుగయుగములు కలుగును గాక! ఆమేన్! యేసుక్రీస్తుకు ఆమేన్ అనే పేరు, బిరుదం ఉంది. యేసే ప్రకటన గ్రంధమంతటికి ఆమేన్. అన్ని సంఘటనలు ఆయనవైపునకే చూపుతున్నాయి. అంటే కదులుతున్నాయి. ఆయనకే మహిమ ప్రభావములు. యేసే దేవుని ప్రవచనాలకు ఆమేన్!

(మిగతా వచ్చే సంచికలో)

# ప్రార్థన వేదిక

1. డి.రాజశేఖర్ - విశాఖపట్నం
ఆరోగ్యం, కుటుంబం కోసం
2. టి.లిల్లీగ్రేస్ - విశాఖపట్నం
వివాహం, ఉద్యోగం, తండ్రి ఆరోగ్యం కోసం
3. యస్.రాజశేఖర్ - అనంతపూర్
గృహనిర్మాణం కోసం
4. కె.ప్రసాదరావు - రేపల్లి
పెదబాబు, కుమార్తె వివాహం, చినబాబు చదువు కోసం
5. యమ్.విజయ - సికింద్రాబాద్
పిల్లల కుటుంబాల కోసం
6. బి.ఆల్బర్ట్ రత్నస్వామి - గుత్తి
పిల్లల చదువుల కోసం
7. యమ్.వెంకటరెడ్డి - అనంతవరం
ఉద్యోగం పర్మినెంట్ కోసం
8. కె.ఆనంద్‌ప్రేమరాజు - హైదరాబాదు
సుశీలా సమస్యల కోసం
9. వి.విఠల్‌రావు - గుంటూరు
పిల్లల చదువులు, నిషిత ఆరోగ్యం కోసం
10. పి.మార్కు - తిరువూరు
కుమారుని చదువు, పరీక్షల కోసం
11. ఆర్.సౌజి - రాజోలు
బిడ్డల వివాహము, ఉద్యోగం కోసం
12. వి.జీవరత్నం - నిడదవోలు
కుటుంబం, ఆరోగ్యం కోసం
13. బి.రాజారావు - గుంటూరు
రెండో అబ్బాయి కుటుంబం కోసం
14. పి.రవికుమార్ - నిడదవోలు
గర్భఫలం, తమ్ముళ్ళ కొరకు కోసం
15. బి.వెంకయ్య - నెల్లూరు
ఆరోగ్యం కోసం
16. యం.సశీల - విశాఖపట్నం
బాంకునుండి ఇల్లు విడుదల కోసం
17. పి.రాజు - తణుకు
కుటుంబం కోసం
18. మేరీ యేసుదాసు - చిత్తూరు
ఆరోగ్యం, కుటుంబం కోసం
19. కె.జె.మేరీ మార్గరేట్ - గుత్తి
ముగ్గురు కొడుకుల కుటుంబాల కోసం
20. జి.అన్నేజోసఫ్ - భువనేశ్వర్
ఏంజల్, జాషువా చదువుల కోసం
21. జి.జయసుందర్ రాజు - అనంతపూర్
మూగచెవుడు గల కుమార్తె కోసం
22. వి.సుగుణమ్మ - నర్సాపురం
దీర్ఘకాల వ్యాధి స్వస్థత కోసం
23. పి.మార్తమ్మ - గుంటూరు
భర్త ఆరోగ్యం, కుమార్తె ఉద్యోగం, వివాహం కోసం
24. కె.జె.లూథర్‌పాల్ - గుంటూరు
స్టెల్లా ఆరోగ్యం, కుమారుని ఉద్యోగం, గృహం కోసం
25. డి.కమలమ్మ - తెనాలి
మనశ్శాంతి, నెమ్మది కోసం
26. యమ్.శాంతకుమారి - మండపేట
అమ్మ ఆరోగ్యం కోసం
27. డి.కృపావతి - విశాఖపట్నం
మనుమడికి మాటలు చక్కగా రావడం కోసం
28. జె.మోజెస్ - పాలకొల్లు
కుమర్డు, కొడలి ఉద్యోగం, శృతి కోసం
29. పి.ఆర్. రాజేశ్వరి - విజయవాడ
కుమార్తె ఉద్యోగం కోసం
30. పి.మాణిక్యం - విశాఖపట్నం
తల మెడ నరాల బాధనుండి స్వస్థత కోసం

## మెదడుకు మేత

# విశ్వాసవీరులు...

కూర్పు – పాస్టర్ పి.ప్రతాప్ కుమార్

| | | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| బా | ఓ | దు | పౌ | కె | కో | రి | యె | ము | కు | బ్బ | దె | లు |
| దు | ష | మో | రే | లు | ఐ | ము | లు | కు | రా | దె | బె | తా |
| దీ | ఖై | స | షె | గు | ము | హా | బా | నో | బా | డా | చె | మా |
| వె | అ | స | ప్తు | లు | రా | బ్ర | బె | హ | దు | ర | నో | రు |
| బు | రా | మ్న | మూ | ఓ | బే | అ | ల | హే | క్ష | కొ | వ | ము |
| రా | హా | బీ | ఖ | యే | ము | జే | బే | నై | తు | బా | హు | ల |
| కో | గై | రా | చె | డ్గ | లు | లు | వై | సా | రూ | పా | నో | బ |
| ము | ల | గి | ద్యో | ను | ధా | ర్ధ | భ | ను | మై | బు | బా | గ్ని |
| యో | ర్మ | టో | త | న | న్యా | ర | య | రం | మ్సో | నో | కో | అ |
| కం | సే | చ | ద | లు | యే | శ్రా | ఇ | చ్చి | ప | స | రు | యా |
| వ | డ్డి | పు | ట్టె | ఫ్తా | ప్ర | త్యు | కా | దా | ము | ము | నా | కు |
| నో | హా | ఓ | కు | గొ | యొ | ఎం | కు | రై | వీ | క్షే | ల | ము |
| బ | ల | ము | హ | సిం | కా | ద | స్సా | ఎ | ట్టి | దు | ది | తో |
| గా | ము | ల | ఫ | న | గ్దా | వా | ఇ | చు | దు | పొం | సం | హిం |

1. అబ్రహాము
2. ఇస్సాకు
3. యాకోబు
4. యోసేపు
5. మోషె
6. గిద్యోను
7. బారాకు
8. సమ్సోను
9. యెఫ్తా
10. దావీదు
11. సమూయేలు
12. హేబేలు
13. హానోకు
14. నోవహు
15. వాగ్దానఫలము
16. యెరికో
17. ఐగుప్తు
18. ఇశ్రాయేలు
19. ఖైదు
20. గొట్టెచర్మము
21. రాహాబు
22. తామారు
23. రూతు
24. పౌలు
25. సింహబలము
26. అగ్నిబలమున
27. ఖడ్గదార
28. కొరడాదెబ్బ
29. రంపములతో
30. హింసపొందుచు

**సూచనలు:**

1. స్పందనలో ప్రింట్ చేసిన గ.ను.క. లోనే పంపాలి. వేరుగా పంపినవి స్వీకరింపబడవు.

2. పూర్తిచేసిన గ.ను.క. లు డిసెంబర్ 25లోపు, ఇతర రాష్ట్రాలవారు పత్రిక అందిన వారంలోగా మాకందేటట్లు పంపాలి.

పూర్తి చేసి పంపిన వారి పేరు..........................

స్పందన కోడ్ నంబరు ..............................

ఊరి పేరు ............................

## డిసెంబర్ గళ్ళ నుడి కట్టు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | | | | ⊗ | ⊗ | ⊗ | 3 |
| | ⊗ | | ⊗ | ⊗ | ⊗ | 4 | 5 | | |
| | ⊗ | 6 | | 7 | | ⊗ | | ⊗ | |
| | ⊗ | | ⊗ | | ⊗ | 8 | | ⊗ | |
| ⊗ | ⊗ | 9 | | | | ⊗ | | 10 | ⊗ |
| 11 | | ⊗ | ⊗ | ⊗ | ⊗ | ⊗ | 12 | | ⊗ |
| | ⊗ | ⊗ | 13 | | | 14 | ⊗ | | ⊗ |
| 15 | | 16 | | ⊗ | ⊗ | | ⊗ | 17 | 18 |
| ⊗ | ⊗ | | ⊗ | 19 | | | ⊗ | ⊗ | |
| 20 | | | ⊗ | | ⊗ | 21 | | | |

## అడ్డం

1. ప్రభువు ఎలీసబెతు మీద – – – – – – – ముంచెనని ఆమె పొరుగువారు, బంధువులను విని ఆమెతో కూడ సంతోషించెను.
4. ప్రభువు తన ప్రవక్త ద్వారా పలికిన మాట నెరవేరునట్లు – – – – జరిగెను. (మత్తయి)
6. సత్యమైనది దూరముగాను, – – – – గాను ఉన్నది. (ప్రసంగి)
8. "సౌలు వేలకొలదియు, దావీదు పదివేలకొలదియు హతము చేసెనను మాట సౌలుకు – – గా లేవు.
9. యెరూషలేమును పాడుదిబ్బలుగాను – – – – చోటుగాను నేను చేయుచున్నాను. (యిర్మీయా)
11. అబ్రాము బయలుదేరి వచ్చిన మొదటి ప్రాంతం – –
12. కీడు చేయుట – – మేలు చేయుము. (తలక్రిందులు)
13. నేను పడిన కష్టము నిష్ప్రయోజనము – – – – క్రీస్తుదినమున నాకు అతిశయకారణము కలుగును. (ఫిలిప్పి)
15. (యేసు) దాసుని స్వరూపమును ధరించుకొని తన్నుతానే – – – – చేసికొనెను.
17. – – మాలిన్యము అంటకుండ చూచుకొనుడి.
19. యేసును చంపవలెనని ప్రధానయాజకులను, ప్రజలపెద్దలును – – – ఆలోచన చేసిరి. (మత్తయి)
20. అయితే – – – వారి మధ్యనుండెను గనుక తన మాట యోసేపు గ్రహించెనని వారు తెలిసికొనలేదు.
21. బోయజు తాత పేరు – – – –

## నిలువు

1. మరియు – – – – మత్తులై యుండకుడి. (ఎఫెసీ)
2. హేరోదు జ్ఞానులను రహస్యముగా పిలిపించి ఆ నక్షత్రము – – – – – – కాలము వారి చేత పరిష్కారముగా తెలిసికొని..
3. యెహోవా పట్టణమును కాపాడని యెడల దాని కావలి – – – – మేలుకొని యుండుట వ్యర్థమే. (కీర్తనలు)
5. అతని కాయము నీలరత్నఖచితమైన విచిత్రమగు – – – – – గా కనబడుచున్నది.
7. – – – – చేతిలో నుండి నీ హస్తబలముచేత నన్ను రక్షింపుము. (కీర్తనలు 1-50)
10. యెహోవా "అతడు – – – – – దాగియున్నాడని సెలవిచ్చెను" (1సమూయేలు)
11. ఎంతస్థిరుడైనను ప్రతివాడును కేవలము వట్టి – – – వలె ఉన్నాడు. (కీర్త 1-50)
13. – – ఆయన తన అద్వితీయకుమారునిగా పుట్టిన వానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక..
14. కొట్టివేయబడని – – – – పేరు వారికి పెట్టుచున్నాను. (యెషయా)
16. ప్రభువు చేత – – – యని ఎంచబడినవాడు ధన్యుడు. (రోమా)
18. మీకు దర్శనము కలుగకుండ రాత్రి – – – (మీకా)
19. నారబట్టలు వేసుకొని – – పైన ఆడుచున్న ఆ మనుష్యుని మాటను నేను వింటిని. (దానియేలు)